సంపుటి : 9
సంచిక : 364
శనివారం
26 సెప్టెంబర్ 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

# విశ్వం వాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE




Contact For Ads:
7579339999

### పవన్ సమక్షంలో
## జనసేనలో చేరిన వైకాపా నేతలు



**అమరావతి, సెప్టెంబర్ 25, విశ్వం వాయిస్ న్యూస్ :** వైకాపా నుంచి పలువురు ముఖ్య నేతలు జనసేన పార్టీలో చేరారు. తుని నియోజకవర్గానికి చెందిన వైకాపా నేత యనమల కృష్ణుడు, హిందూపురం నియోజకవర్గం నుంచి నవీన్ నిశ్చల్.. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన కండువా కప్పుకొన్నారు. వీరితో పాటు.. ఏలూరు డీసీసీబీ మాజీ ఛైర్మన్ పీవీఎల్ఎన్ నరసింహరాజు, వైకాపా కందుకూరు, సర్వేపల్లి, కనిగిరి నియోజకవర్గాల పరిశీలకుడు మన్నెమాల సుకుమార్ రెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు అయితాబత్తుల సుభాషిణి, తుని వైకాపా నాయకుడు మిగతా .. 2లో..

# సీమకు మహర్దశ



- రూ.లక్ష కోట్ల పెట్టుబడితో హార్టీకల్చర్ హబ్
- రాయలసీమను గ్లోబల్ ఫ్రూట్ బౌల్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం శ్రీకారం
- రూ. లక్ష కోట్ల పెట్టుబడులతో 201 క్లస్టర్లలో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు
- అక్టోబర్ 2న మదనపల్లెలో ప్రాజెక్టును ప్రారంభించనున్న చంద్రబాబు
- ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో సీమ ఆర్థిక స్వరూపం మార్పు లక్ష్యం
- ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై సమీక్ష

**అమరావతి,సెప్టెంబర్ 25, విశ్వం వాయిస్ న్యూస్ :** రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యాన పంటల కేంద్రంగా (గ్లోబల్ ఫ్రూట్ బౌల్) తీర్చిదిద్దేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బృహత్ ప్రణాళికను సిద్ధం చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో సుమారు రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో 'రాయలసీమ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ హబ్' ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో సీఎం ఈ వివరాలు తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాతో పాటు రాయలసీమలోని 10 జిల్లాల్లో 201 క్లస్టర్ల ద్వారా ఈ హబ్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో ప్రభుత్వం రూ. 40 వేల కోట్లు, ప్రైవేటు రంగం రూ.60 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. ఒకప్పుడు కరవుతో అల్లాడిన రాయలసీమను ఉద్యాన రంగం ద్వారా ఆర్థికంగా ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. హంద్రీనీవా, గాలేరు-నగరి వంటి ప్రాజెక్టుల ద్వారా నీటి లభ్యత పెరగడం ఈ మార్పునకు దోహదం చేసిందని ఆయన గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను (ఎఫ్‌పీవో) బలోపేతం చేయనున్నారు. కొత్త పంటలు, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్ అవకాశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. ఇదే కార్యక్రమంలో భాగంగా మిగతా .. 2లో..

### క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టుల కోసం
## ఏపీని ఎంచుకోవాలి

- టోరెంట్, వెల్స్‌పన్, ఆస్టల్.. అహ్మదాబాద్‌లో రెండో రోజు కూడా నారా లోకేశ్ బిజీబిజీ
- అహ్మదాబాద్ పర్యటనలో పారిశ్రామిక దిగ్గజాలతో మంత్రి లోకేశ్ వరుస సమావేశాలు
- విశాఖలో టైర్ల తయారీ, డేటా సెంటర్ల ఏర్పాటుపై పలు సంస్థలతో కీలక చర్చలు
- కాకినాడ, నెల్లూరులలో ఇండస్ట్రియల్ పార్కులు, రిఫైనరీలు స్థాపించాలని విజ్ఞప్తి
- లోకేశ్ ప్రతిపాదనలను పరిశీలిస్తామని సానుకూలంగా స్పందించిన కంపెనీలు



**గుజరాత్, సెప్టెంబర్ 25, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీకి పెట్టు బడులే లక్ష్యంగా ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ విస్తృత పర్యటనలు కొనసాగిస్తున్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ టూర్‌లో భాగంగా రెండో రోజైన శుక్రవారం ఆయన పలు పారిశ్రామిక దిగ్గజాలతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడమే ధ్యేయంగా ఏడు ప్రముఖ సంస్థల అధిపతులు, ప్రతినిధులతో చర్చలు జరిపారు. క్లీన్ ఎనర్జీ, ఫార్మా, టెక్స్‌టైల్స్, మౌలిక సదు పాయాలు, డేటా సెంటర్లు, తయారీ వంటి కీలక రంగాల్లో ఏపీలో ఉన్న అవకాశాలను వారికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధా నాలు, అందిస్తున్న ప్రోత్సాహకాలను మిగతా .. 2లో..

### రైతు సంక్షేమమే ప్రభుత్వ
## తొలి ప్రాధాన్యం
- వార్త 2 లో..

### రైతుకు ధర భరోసా..
## వినియోగదారుడికి ధరల ఊరట
- వార్త 2 లో..

### ఏపీలో పొగాకు రైతులకు
## కేంద్రం శుభవార్త
- వార్త 2 లో..

### ఎన్నికల సంఘంలో విభేదాలు అంటూ కథనం..
## ఆందోళన వ్యక్తం చేసిన జగన్
- వార్త 2 లో..

## నిమజ్జనోత్సవాల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలి : మంత్రి పొన్నం



**హైదరాబాద్, సెప్టెంబర్ 25, విశ్వం వాయిస్ న్యూస్ :** గణేశ్ నిమజ్జనోత్సవాల ప్రక్రియను ఉత్సవ నిర్వాహకులు వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. వర్షం కురిసే అవకాశమున్నందున నిర్వాహకులు ఈ దిశగా ఆలోచించాలని కోరారు. ఈ రోజు రాత్రి వరకు నిమజ్జనోత్సవాన్ని పూర్తి చేయాలనే భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. గణేశ్ నిమజ్జనోత్సవాల ప్రక్రియను మంత్రి పొన్నం ప్రభాకర్ డీజీపీ సీవీ ఆనంద్, మిగతా .. 2లో..

### గంగమ్మ ఒడికి చేరిన
## ఖైరతాబాద్ బడా గణేశుడు

**హుస్సేన్‌సాగర్‌లో ఘనంగా నిమజ్జనోత్సవం**



**హైదరాబాద్, సెప్టెంబర్ 25, విశ్వం వాయిస్ న్యూస్ :** భాగ్యనగరంతో పాటు తెలుగు రాష్ట్రాల్లోనే అత్యంత ప్రత్యేకం, ప్రతిష్టాత్మకమైన ఖైరతాబాద్ బడా గణేశుడి నిమజ్జన ప్రక్రియ ఉత్కంఠ భరిత వాతావరణంలో, భక్తుల జయజయధ్వానాల నడుమ ప్రశాంతంగా ముగిసింది. ఈ ఏడాది మిగతా .. 2లో..






(మొదటిపేజీ తరువాయి)

# సీమకు మహర్దశ..

మదనపల్లెలో 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'కు కూడా సీఎం శంకుస్థాపన చేయనున్నారు. ఈ సమీక్షలో ఎల్‌నినో ప్రభావం, ద్రవ్యోల్బణంపై కూడా సీఎం అధికారులతో చర్చించారు. ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు శనగ, మినుము, రాగులు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. నిత్యావసరాల ధరలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూనే వినియోగదారులపై భారం పడకుండా చూడాలని ఆదేశించారు. ఈ హబ్ ద్వారా రాబోయే 5-6 ఏళ్లలో సీమ రూపురేఖలు మార్చాలని లక్ష్యంగా నిర్దేశించారు.

## ఏపీని ఎంచుకోవాలి

తెలియజేసి, పెట్టుబడులు పెట్టాల్సిం దిగా ఆహ్వానించారు. లోకేశ్ ప్రతిపాద నలపై కంపెనీల ప్రతినిధులు సాను కూలంగా స్పందించి, వాటిని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

**క్లీన్ ఎనర్జీలో ఏపీని ఎంచుకోండి: టోరెంట్ గ్రూప్‌తో లోకేశ్**

ఫార్మా, పవర్ రంగాల్లో అగ్రగామిగా ఉన్న టోరెంట్ గ్రూప్ చైర్మన్ సమీర్ మెహతా, ఇతర డైరక్టర్లతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. రాష్ట్రంలోని ఫార్మా క్లస్టర్లలో ఏపీఐ, ఇంటర్మీడియట్ తయారీ సామర్థ్యాన్ని విస్తరించాలని కోరారు. ముఖ్యంగా, పునరుత్పాదక ఇంధన రంగంలో టోరెంట్ గ్రూప్ ప్రణాళికలను ప్రస్తావిస్తూ.. సౌర, పవన, హైబ్రిడ్ ప్రాజెక్టులకు ఏపీ అనువైనదని తెలిపారు. పంప్డ్-స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్ వంటి క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు రాష్ట్రాన్ని గమ్యస్థానంగా ఎంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సమీర్ మెహతా స్పందిస్తూ.. 2030 నాటికి 10 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించడమే తమ లక్ష్యమని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను తప్పక పరిశీలిస్తామని చెప్పారు.

**కాకినాడలో ఇండస్ట్రియల్ పార్క్: వెల్స్‌పన్ గ్రూప్‌కు ప్రతిపాదన**

టెక్స్‌టైల్స్, మౌలిక సదుపాయాల రంగంలో ప్రసిద్ధిగాంచిన వెల్స్‌పన్ వరల్డ్ గ్రూప్ సీఈఓ నితిన్ జైన్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. గతంలో దావోస్‌లో సీఎం చంద్రబాబుతో జరిగిన చర్చల పురోగతిని సమీక్షించారు. విశాఖపట్నంలో వెల్స్‌పన్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. కాకినాడలో టెక్స్‌టైల్స్, లాజిస్టిక్స్, పైపుల తయారీ, గ్రీన్ అమ్మోనియా యూనిట్లతో కూడిన ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. నితిన్ జైన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం కర్నూలు, కడపలో తమ సంస్థ 100 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును నిర్వహిస్తోందని, తాజా ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తామని తెలిపారు.

**నెల్లూరులో ఆయిల్ రిఫైనరీలు: గోకుల్ ఆగ్రోతో చర్చలు**

వంట నూనెల తయారీలో పేరొందిన గోకుల్ ఆగ్రో రిసోర్సెస్ చైర్మన్ కనుభాయ్ ఠక్కర్‌తో లోకేశ్ భేటీ అయ్యారు. నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో ఇప్పటికే ఉన్న ప్లాంట్‌కు అదనంగా పామాయిల్, సోయాబీన్ ఆయిల్ రిఫైనరీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. దీనిపై కనుభాయ్ ఠక్కర్ స్పందిస్తూ.. కృష్ణపట్నంలో తమ ప్లాంట్ 2024 నుంచి ఉత్పత్తి ప్రారంభించిందని, దక్షిణాది మార్కెట్ల కోసం విస్తరణ ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**విశాఖలో టైర్ల తయారీ యూనిట్: చిరిపాల్ గ్రూప్‌కు ఆహ్వానం**

టెక్స్‌టైల్స్, కెమికల్స్ రంగాల్లోని చిరిపాల్ గ్రూప్ మేనేజింగ్ డైరక్టర్ బ్రిజ్ మోహన్ చిరిపాల్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. విశాఖపట్నం కనెక్టివిటీ, మౌలిక వసతులను వివరిస్తూ.. అక్కడ గ్రీన్‌ఫీల్డ్ టైర్ల తయారీ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై బ్రిజ్ మోహన్ చిరిపాల్ స్పందిస్తూ.. ప్రస్తుతం తమకు పలు రాష్ట్రాల్లో తయారీ యూనిట్లు ఉన్నాయని, టైర్ల తయారీకి సంబంధించి ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలిస్తామని అన్నారు.

**డేటా సెంటర్లలో పెట్టుబడులు పెట్టండి: ఎస్టీ టెలీమీడియాతో లోకేశ్**

డేటా సెంటర్ల దిగ్గజం ఎస్టీ టెలీమీడియా వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ జెనాతో లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖపట్నం డేటా సెంటర్ హబ్‌గా ఎదుగుతోందని, ఇప్పటికే గూగుల్, రిలయన్స్ వంటి సంస్థలు ముందుకు వచ్చాయని తెలిపారు. ఈ నేపథ్యంలో విశాఖలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. దీనిపై గౌతమ్ జెనా స్పందిస్తూ.. తమ సంస్థ కార్యకలాపాలను వివరించి, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలిస్తామని చెప్పారు.

**విశాఖలో ప్రీ ఫ్యాబ్ కేంద్రం: ఈప్యాక్ గ్రూప్‌తో భేటీ**

ప్రీ ఫ్యాబ్ నిర్మాణ రంగంలో పేరొందిన ఈప్యాక్ గ్రూప్ చైర్మన్ భజరంగ్ బోత్రాతో లోకేశ్ సమావేశమయ్యారు. డేటా సెంటర్ల నిర్మాణానికి అవసరమైన ప్రీ ఫ్యాబ్ నిర్మాణ కేంద్రాన్ని విశాఖలో ఏర్పాటు చేయాలని కోరారు. భజరంగ్ బోత్రా మాట్లాడుతూ.. ఇప్పటికే శ్రీసిటీలో తమకు తయారీ యూనిట్లు ఉన్నాయని, విశాఖ ప్రతిపాదనను కూడా పరిశీలిస్తామని తెలిపారు.

**పైపుల తయారీ కేంద్రం ఏర్పాటు చేయండి: ఆస్ట్రల్ పైప్స్‌తో సమావేశం**

పైపుల తయారీలో అగ్రగామిగా ఉన్న ఆస్ట్రల్ పైప్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ అల్కేష్ పంచల్‌తో మంత్రి లోకేష్ చర్చలు జరిపారు. రాష్ట్రంలో నిర్మాణ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్నందున, కాకినాడ లేదా అనకాపల్లిలో పైపుల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. అల్కేష్ పంచల్ స్పందిస్తూ.. తమకు దేశవ్యాప్తంగా విస్తృత నెట్‌వర్క్ ఉందని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## జనసేనలో చేరిన వైకాపా నేతలు

పొలినాటి శేషగిరిరావు, తణుకు వైకాపా నాయకుడు దిరిశాల కృష్ణ శ్రీనివాస్, శ్రీకాళహస్తికి చెందిన వైకాపా నేత సత్రవాడ ప్రవీణ్, మిద్దెల హరి, ముమ్మడివరం మాజీ ఏఎంసీ చైర్మన్ కుడిపూడి శివన్నారాయణ నరసరావుపేట నుంచి ఏలూరి ప్రసాద్ జనసేనలో చేరారు. వారందరికీ పవన్ కల్యాణ్ జనసేన కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానం పలికారు. పార్టీ సిద్ధాంతాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అందరినీ కలుపుకొని వెళ్లి పార్టీ ఉన్నతి కోసం పని చేయాలని పవన్ సూచించారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు, పరిపాలనలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిబద్ధత, సంస్కరణలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు.

## ఖైరతాబాద్ బడా గణేశుడు

69 అడుగుల భారీ ఆకారంలో 'పంచ ముఖ సంకటహర మహాగణపతి'గా కొలువైన బొజ్జ గణపయ్య హుస్సేన్ సాగర్ జలాల్లో గంగమ్మ ఒడికి చేరాడు. శుక్రవారం ఉదయం 9.30 గంటల సమయంలో ఖైరతాబాద్ మండపం నుంచి ప్రారంభమైన మహాగణపతి శోభాయాత్ర సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా ఎన్టీఆర్ మార్గ్‌కు కనులపండువగా సాగింది. మార్గమధ్యంలో వేలాది మంది భక్తులు స్వామివారికి హారతులు పడుతూ, 'గణపతి బప్పా మోరియా' నినాదాలతో పరిసరాలను మారుమోగించారు. ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకున్న బడా గణేశుడికి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చివరి పూజలు, నివేదనలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం క్రేన్ నంబర్ 4 వద్ద మధ్యాహ్నం 2.15 గంటలకు భారీ క్రేన్ల సహాయంతో శాస్త్రోక్తంగా నిమజ్జన ఘట్టాన్ని పూర్తి చేశారు. శోభాయాత్ర ప్రారంభ సమయంలో ఎమ్మెల్యే దానం నాగేందర్ మహాగణపతి ఎదుట ఉత్సాహంగా డాన్స్ చేసి అలరించగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించారు. ఎంతటి ఎత్తులోకొలువైనా, ఎంతటి వైభవాన్ని ప్రదర్శించినా ఆ గణనాథుడు ఆఖరుకు ప్రకృతి ఒడికే చేరాలనే సనాతన సత్యానికి ఈ నిమజ్జనోత్సవమే సజీవ సాక్ష్యం. నవరాత్రుల పాటు కోట్లాది మంది భక్తుల నీరాజనాలు అందుకొని, విఘ్నాలను తొలగించే వినాయకుడు భక్తులలో సరికొత్త ఆశలను, నమ్మకాన్ని నింపి సెలవు తీసుకున్నాడు. ఉత్సవాల నిర్వహణలోనూ, వేలాది మంది జనసందోహం నడుమ గంటల వ్యవధిలోనే ఎంతో క్రమశిక్షణతో నిమజ్జనాన్ని పూర్తి చేయడంలో యంత్రాంగం చూపిన సమర్థత ప్రశంసనీయం. రూపు మారినా, కాలం మారినా తరతరాలుగా ఈ భాగ్యనగర ఆధ్యాత్మిక సెంటిమెంట్‌ను, సంస్కృతిని కాపాడుకుంటూ వస్తున్న ఇలాంటి ఆచారాలు సమాజంలో భక్తి చైతన్యాన్ని ఎప్పుడూ రగిలిస్తూనే ఉంటాయి.

## నిమజ్జనోత్సవాల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలి

సీపీ సజ్జనర్, కలెక్టర్ ప్రియాంక అల, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌తో కలిసి విహంగ వీక్షణం చేశారు. హుస్సేన్ సాగర్ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. డప్పు చప్పుళ్లు, భక్తుల ఆటపాటలు, నృత్యాలతో సందడి వాతావరణం నెలకొంది. హైదరాబాద్‌లో మొత్తం 114 నిమజ్జన కేంద్రాలు ఏర్పాటు చేశారు. నిమజ్జనం కోసం 14,840 దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటికే 10వేలకు పైగా విగ్రహాలు పూర్తయ్యాయని సీపీ సజ్జనర్ తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా నిమజ్జనోత్సవం జరుగుతుందన్నారు. శనివారం ఉదయం లోపు అన్ని విగ్రహాల నిమజ్జనం పూర్తవుతుందని భావిస్తున్నట్లు చెప్పారు.

రైతుకు ధర భరోసా..

## వినియోగదారుడికి ధరల ఊరట

**రైతుబజార్లలో కిలో సన్నబియ్యం రూ.50.. ఉల్లిపాయలు రూ.35**

**ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కిలో చక్కీ గోధుమపిండి రూ.27కు సరఫరా**

**ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో సమగ్ర కార్యాచరణ: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**అమరావతి, సెప్టెంబర్ 25, విశ్వం వాయిస్ న్యూస్ :** రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడం, వినియోగదారులకు నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు అందించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతుబజార్లు, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులను అందిస్తూ ప్రజలపై ధరల భారం తగ్గిస్తున్నామన్నారు. మరోవైపు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల సాగును ప్రోత్సహించి, రైతులకు కొనుగోలు భరోసా కల్పించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ధరల పర్యవేక్షణ, నిత్యావసరాల ధరల స్థిరీకరణ, వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర, రబీ పంటల ప్రణాళికపై గురువారం రాత్రి మంత్రుల బృందం వర్చువల్ సమావేశం జరిగింది.వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సమావేశంలో పాల్గొన్నారు. చర్చించిన అంశాలు, రూపొందించిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు అచ్చెన్నాయుడు తెలిపారు. ఆయన ఆదేశాలు, సూచనల మేరకు రైతులు, వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించేలా కార్యాచరణ చేపట్టామన్నారు. వినియోగదారులకు నాణ్యమైన సరుకులను అందించేందుకు రైతుబజార్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా కేఎన్ఎం, బీపీటీ వంటి సూపర్ ఫైన్ రకం బియ్యాన్ని కిలో రూ.50కు విక్రయిస్తున్నట్లు మంత్రి వివరించారు. రాష్ట్రంలోని అన్ని రైతుబజార్ల ద్వారా ఉల్లిపాయలను కిలో రూ.35కు అందిస్తున్నామన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నాణ్యమైన పామాయిల్, కందిపప్పును సబ్సిడీ ధరలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. చక్కీ గోధుమపిండిని కూడా కిలో రూ.27కు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పాలు, బియ్యం, చికెన్, వంటనూనెలు, కందిపప్పు, మినుములు, వేరుశనగ, ఉల్లిపాయలు, గుడ్లు, టమాటా, అరటి తదితర 14 ప్రధాన వస్తువుల ధరలను నిరంతరం పర్యవేక్షించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. రాష్ట్ర వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ)లో ఆహార వస్తువులకు కేటాయించిన మొత్తం వెయిటేజీలో వీటి వాటా 57.37 శాతంగా ఉందన్నారు. అందువల్ల ఆయా వస్తువుల ఉత్పత్తి, సరఫరా, నిల్వలు, మార్కెట్ ధరలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రాష్ట్ర వినియోగ అవసరాలు, పంటల ఉత్పత్తి, రైతులకు లభించే ధరలు, వాతావరణ అనుకూలత, మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని జిల్లాలవారీగా సమతుల్య పంటల ప్రణాళిక రూపొందించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 8.81 లక్షల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు కార్యాచరణ సిద్ధం చేసినట్లు వివరించారు. ఈ ప్రణాళికలో భాగంగా వరి సాగు నుంచి 3 లక్షల హెక్టార్లు, ఖరీఫ్‌లో సాగు కాని 4 లక్షల హెక్టార్లు, మిరప సాగు తగ్గిన 1.50 లక్షల హెక్టార్లను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించనున్నట్లు తెలిపారు. శనగలు 1.88 లక్షల హెక్టార్లు, మొక్కజొన్న 1.51 లక్షల హెక్టార్లు, మినుములు 1.27 లక్షల హెక్టార్లలో సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు మంత్రి పేర్కొన్నారు. పొద్దుతిరుగుడు 72 వేల హెక్టార్లు, పెసలు 68 వేలు, వేరుశనగ 62 వేలు, రబీ జొన్న 60 వేలు, కంది 46 వేలు, ఉల్లిపాయలు-బిందుసేద్యంతో కూరగాయలు 44 వేలు, రాగులు--కొర్రలు--ఇతర చిరుధాన్యాలు 38 వేలు, పచ్చిరొట్ట పంటలు 25 వేల హెక్టార్లలో సాగు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రకాశం జిల్లాలో అత్యధికంగా 1.08 లక్షల హెక్టార్లు, వైఎస్సార్ కడప, పల్నాడు జిల్లాల్లో చెరో 82 వేల హెక్టార్లు, నెల్లూరు జిల్లాలో 78 వేల హెక్టార్లలో ఎంపిక చేసిన పంటలను సాగు చేయాలని నిర్ణయించినట్లు వివరించారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు ముందస్తుగా నమోదు చేసుకున్న రైతుల నుంచి రాగులు, కందులు, మినుములను కనీస మద్దతు ధరకు 100 శాతం కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు అచ్చెన్నాయుడు వెల్లడించారు. పచ్చిరొట్ట పంటల విత్తనాలను సైతం పూర్తిస్థాయిలో తిరిగి కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. పెసలు, శనగలు, వేరుశనగ, పొద్దుతిరుగుడు ఉత్పత్తిలో 30 శాతం వరకు కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మొక్కజొన్నకు అవసరమైన కొనుగోలు మద్దతు కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు. మొక్కజొన్న ధరలు గుడ్లు, చికెన్, పాల ధరలపై ప్రభావం చూపుతున్నందున మార్కెట్‌లో తగిన జోక్యం చేసుకోవాలని నిర్ణయించామన్నారు. జొన్నలు, రాగులను ప్రజా పంపిణీ వ్యవస్థలో చేర్చి, కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసే అంశంపై కేంద్ర ప్రభుత్వ సహకారం కోరనున్నట్లు వివరించారు. కందుల సాగు కాలం ముగిసిన నేపథ్యంలో ధరల స్థిరీకరణ నిధి బఫర్ నిల్వల నుంచి రాష్ట్రానికి లక్ష మెట్రిక్ టన్నుల కందులను కేటాయించాలని కేంద్రాన్ని కోరాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఉల్లిపాయలకు కనీస మద్దతు ధర లేనందున రాష్ట్ర ధరల స్థిరీకరణ నిధి ద్వారా కొనుగోలు చేసి, అదే సమయంలో మార్కెట్‌లో విక్రయించే విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. సాంప్రదాయేతర ప్రాంతాల్లోనూ ఉల్లిపాయల సాగును విస్తరించి, రాష్ట్ర వినియోగ అవసరాలకు సరిపడా ఉత్పత్తిని సాధించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. తద్వారా మహారాష్ట్ర నుంచి సరఫరాపై ఆధారపడటాన్ని దశలవారీగా తగ్గించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులతో వంటనూనెల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో పొద్దుతిరుగుడు, వేరుశనగ సాగు విస్తీర్ణాన్ని పెంచాలని నిర్ణయించినట్లు వివరించారు. రైతులకు ధరల మద్దతు కల్పించే కొనుగోలు కార్యక్రమాలకు మొత్తం రూ.2,216.48 కోట్ల ఆర్థిక మద్దతు అవసరమవుతుందని అంచనా వేసినట్లు అచ్చెన్నాయుడు తెలిపారు. ఇందులో వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు రూ.1,979 కోట్ల ప్రభుత్వ హామీ, కొనుగోలు కార్యకలాపాల నిర్వహణకు రూ.237.48 కోట్ల వ్యయం ఉన్నట్లు వివరించారు. విత్తనాల సరఫరా కోసం ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థకు పెండింగ్‌లో ఉన్న రూ.184 కోట్లతోపాటు అదనంగా ఆమోదించిన రూ.94 కోట్లు కలిపి మొత్తం రూ.278 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. పంటలను కాపాడేందుకు అవసరమైన రక్షక తడులు అందించడానికి రూ.190 కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించినట్లు తెలిపారు. కార్యాచరణ అమలుకు అవసరమైన నిధులను విడుదల చేయడంతోపాటు వ్యవసాయ, మార్కెటింగ్, పౌరసరఫరాలు, ఆర్థిక శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించినట్లు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం



**ఖరీఫ్ ధాన్యం సేకరణకు పకడ్బందీ ఏర్పాట్లు - రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేకరణ ప్రక్రియ**

**వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్**

**విజయవాడ, సెప్టెంబర్ 25, విశ్వం వాయిస్ న్యూస్ :** రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 2026-27 ఖరీఫ్ ధాన్యం సేకరణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మాది సంపూర్ణ రైతు ప్రభుత్వమని, రైతుకు న్యాయం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని ఆయన స్పష్టం చేశారు. సొంత వాహనాల్లో ధాన్యం తరలించే రైతులకు రవాణా ఛార్జీలను వెంటనే చెల్లింపులు చేస్తామన్నారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యమని, అవసరమైతే కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి ధాన్యం సేకరణ అంచనాలు పెంచుతామన్నారు. శుక్రవారం విజయవాడ అంత్రాలక్స్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన 2026-27 ఖరీఫ్ ధాన్యం సేకరణ రాష్ట్రస్థాయి సన్నద్ధత సమావేశంలో రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్క్ షాపులో పాల్గొన్న అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... ఈ ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎల్‌నీనో ప్రభావం ఉంటుందని తొలుత అంచనా వేసినప్పటికీ, ప్రస్తుతం రాష్ట్రంలో సమృద్ధిగా మూడు రోజులపాటు వర్షాలు కురుస్తుండటంతో ధాన్యం దిగుబడి పెరిగే అవకాశం ఉందన్నారు. అందువల్ల ఉత్పత్తి అంచనాలను మరోసారి సమీక్షించి, అవసరమైతే సవరించనున్నట్లు చెప్పారు.

**24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో సేకరణ సొమ్ము**

ధాన్యం సేకరణలో కూటమి ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చిందని మంత్రి తెలిపారు. గత ఖరీఫ్‌లో సుమారు రూ.12 వేల కోట్ల ధాన్యం సేకరణ సొమ్మును రైతులకు 24 గంటల్లోపే చెల్లించామని పేర్కొన్నారు. అదే విధంగా ఈసారి కూడా రైతులకు ఎలాంటి జాప్యం లేకుండా సేకరణ సొమ్ము చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

**సొంత వాహనాలతో ధాన్యం తరలించే రైతులకు వెంటనే రవాణా ఛార్జీలు**

రైతులు తమ సొంత వాహనాల్లో కల్లాల నుంచి రైస్ మిల్లులకు ధాన్యం తరలించినప్పుడు రవాణా ఛార్జీల చెల్లింపులో జాప్యం జరుగుతున్న సమస్యను ఈ ఖరీఫ్ నుంచి పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. సొంత వాహనాలను ఏర్పాటు చేసుకుని ధాన్యం తరలించే రైతులకు రవాణా ఛార్జీలు సకాలంలో, వీలైనంత త్వరగా వారి ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఖరీఫ్‌లో రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం సేకరణ కోసం దాదాపు 31 వేల వాహనాలను అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించారు.

**6.10 కోట్ల గన్నీ బ్యాగులు సిద్ధం**

ధాన్యం సేకరణకు ఈ సీజన్‌లో 6.10 కోట్ల గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఎక్కడా గన్నీ బ్యాగుల కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, నాణ్యమైన గన్నీ బ్యాగులు రైతులకు అందేలా చూస్తున్నామని చెప్పారు. ఒకవేళ ఎక్కడైనా గన్నీ బ్యాగుల కొరత ఏర్పడితే ప్రత్యామ్నాయ బ్యాగులను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

**2,619 ధాన్యం సేకరణ కేంద్రాలు**

రాష్ట్రవ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో 2,619 ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అవసరమైన అన్ని సౌకర్యాలతో సేకరణ కేంద్రాలను సిద్ధం చేస్తున్నామని, సుమారు 24 వేల మంది సిబ్బంది రైతులకు సేవలు అందించనున్నారని తెలిపారు. సేకరణ కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించినట్లు చెప్పారు. ముందస్తుగానే సిబ్బందికి ధాన్యం సేకరణ కేంద్రాల నిర్వహణపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించినట్లు తెలిపారు.

**రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి సహకరించాలి**

ధాన్యం సేకరణ ప్రక్రియలో రైస్ మిల్లర్లు కూడా ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో సహకరించాలని మంత్రి కోరారు. వారికి కేటాయించిన లక్ష్యాలను సమయానికి పూర్తి చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహకరించాలని సూచించారు.

**రైతుల కోసం ప్రత్యేక సహాయ కేంద్రాలు**

ధాన్యం సేకరణకు సంబంధించి రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా జిల్లాల వారీగా జాయింట్ కలెక్టర్లు ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు కష్టం రాకుండా చూడటమే ప్రభుత్వ ఆశయమన్నారు. ధాన్యం సేకరణలో ఎప్పటికప్పుడు కొత్త సంస్కరణలు తీసుకొస్తూ, రైతులకు వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

## ఏపీ పొగాకు రైతులకు కేంద్రం శుభవార్త

**రూ. 220 కోట్ల నిధులు.. నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ**



**అమరావతి, సెప్టెంబర్ 25, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లోని ఫ్లూ-క్యూర్డ్ వర్జీనియా (ఎఫ్‌సీవీ) పొగాకు రైతులకు ఊరట కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మారుతున్న ప్రపంచ మార్కెట్ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు సకాలంలో ఆర్థిక చేయూత అందించే లక్ష్యంతో, ఒక్కో బ్యారన్‌కు రూ. 50,000 చొప్పున వడ్డీలేని రుణాన్ని ఒకే దఫాలో అందించేందుకు శుక్రవారం ఆమోదం తెలిపింది. 'వడ్డీలేని వర్కింగ్ క్యాపిటల్ సహాయ పథకం' కింద ఈ ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని సుమారు 44,000 మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఇందుకోసం కేంద్రం దాదాపు రూ. 220 కోట్లను కేటాయించింది. ఈ మొత్తాన్ని డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) పద్ధతిలో నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేయనున్నారు. ఈ తక్షణ ఆర్థిక సాయం ద్వారా రైతులు తమ కుటుంబ అవసరాలు తీర్చుకోవడంతో పాటు, సంస్థాగత రుణాలను చెల్లించడానికి, రాబోయే పంట సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు వంటి వాటిని కొనుగోలు చేయడానికి వీలు కలుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అదే సమయంలో ప్రైవేట్ అప్పులపై రైతులు ఆధారపడటాన్ని తగ్గించడం కూడా ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఆంధ్రప్రదేశ్‌లోని నల్ల రేగడి, దక్షిణ తేలికపాటి నేలల్లో పండించే ఎఫ్‌సీవీ పొగాకుకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. తక్కువ నికోటిన్, మంచి రంగు వంటి లక్షణాల కారణంగా ఎగుమతుల్లో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. రాష్ట్రంలో 2025-26 పంట సీజన్‌కు సంబంధించిన వేలం ప్రక్రియ మార్చి 25, 2026న ప్రారంభం కాగా, ఇప్పటివరకు సుమారు 100 మిలియన్ కిలోల పొగాకును వేలం వేసినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా పొగాకు మార్కెట్‌లో మారుతున్న డిమాండ్, భౌగోళిక రాజకీయ పరిణామాలు, అంతర్జాతీయ వాణిజ్య పోకడల కారణంగా పంట సేకరణ, మార్కెటింగ్‌పై ప్రభావం పడుతోందని ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో, పంట సేకరణను సులభతరం చేయడానికి, మార్కెట్‌లో భాగస్వామ్యాన్ని పెంచడానికి, ఎగుమతులను ప్రోత్సహించడానికి సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు కేంద్రం వెల్లడించింది. ఎగుమతిదారులు, కొనుగోలుదారులు, రైతులతో నిరంతరం చర్చిస్తూ పొగాకు రంగాన్ని బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించింది.

ఎన్నికల సంఘంలో విభేదాలు అంటూ కథనం..

## ఆందోళన వ్యక్తం చేసిన జగన్

**ఏపీలో గతంలో తమ అభ్యంతరాలను పట్టించుకోలేదని ఆరోపణ**



**తాడేపల్లి, సెప్టెంబర్ 25, విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ)లో అంతర్గత విభేదాలు ఉన్నట్టు జాతీయ మీడియాలో కథనం రావడం, దేశవ్యాప్తంగా ప్రకంపనలు రేగడంపై వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం జగన్ స్పందించారు. ఈసీ పనితీరు, నియామకాల పద్ధతిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం నిలబడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘ పోస్ట్ చేశారు. ఎన్నికల కమిషనర్ల నియామకం కోసం ఉద్దేశించిన 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ యాక్ట్, 2023'ను పునఃసమీక్షించి, సవరించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల జాతీయ మీడియాలో వచ్చిన కథనాలను జగన్ తన పోస్టులో ప్రస్తావించారు. ఎన్నికల సంఘం తీసుకున్న పలు నిర్ణయాలు, ఓటర్ల జాబితాల రూపకల్పన, ఈసీఐనెట్ నిర్వహణ వంటి అంశాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న వార్తలు ప్రజల్లో తీవ్రమైన ప్రశ్నలు, సందేహాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు. ఆరోపణలు, ప్రత్యారోపణల కంటే.. ఏయే అంశాలపై అభ్యంతరాలు నమోదయ్యాయి, వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు, ఓటర్ల జాబితాలో పేర్ల చేర్పులు, తొలగింపులు, పునరుద్ధరణ ప్రక్రియ ఎంత పారదర్శకంగా జరిగిందనే దానిపై ప్రజలకు స్పష్టత అవసరమని జగన్ నొక్కిచెప్పారు. ఈ విషయాలపై ప్రజలకు నమ్మకం కలిగించే చర్యలు తక్షణమే చేపట్టాలని సూచించారు. ఈ నేపథ్యంలో, గతంలో తాము కూడా మద్దతు ఇచ్చిన 2023 నాటి ఎన్నికల కమిషనర్ల నియామక చట్టాన్ని ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందని జగన్ పేర్కొన్నారు. ఈ భయాలను తొలగించి, సాధారణ పరిస్థితులను నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వమే ముందుకు రావాలని కోరారు. ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)లతో కూడిన త్రిసభ్య కమిటీ ద్వారానే ఎన్నికల కమిషనర్లను నియమించే పాత విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. "పరీక్ష రాసే విద్యార్థే, తన ఎగ్జామినర్‌ను నియమించుకుంటే, ఆ అధికారి ఎంత నిజాయతీపరుడైనా ఆరోపణలకు ఆస్కారం ఉంటుంది. ఆ స్థానంలో ఒక తటస్థ వ్యక్తి ఉంటేనే మేలు" అని జగన్ ఉదహరించారు.ప్రజాస్వామ్యంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండటమే కాదు, అవి ఉన్నట్టుగా కనిపించాలని, వాటిని కాపాడటమే రాజ్యాంగ సంస్థల ప్రాథమిక విధి అని జగన్ తన పోస్టులో స్పష్టం చేశారు.

# ఎడిటర్ వాయిస్

## వైసీపీ శక్తి మంతం అవుతుందా.. ఘర్‌వాపసీపైనే ఆశలు..!

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తులో మళ్లీ శక్తిమంతం అవుతుందా లేదా అనేది ఆ పార్టీ అంతర్గత వ్యూహాలు, ప్రజాదరణ, 'ఘర్ వాపసీ' (పాత నాయకులను తిరిగి పార్టీలోకి తీసుకురావడం) వంటి చర్యలపైనే ఆధారపడి ఉన్నాయి. అయితే.. ఇప్పుడు కొత్త చర్చ ప్రారంభమైంది. ఘర్ వాపసీని ప్రధానంగా చేసుకుని రాజకీయాలు చేయాలని పైనుంచి క్షేత్రస్థాయి నాయకులకు ఆదేశాలు అందాయి. 2024 ఎన్నికల ఓటమి తర్వాత పార్టీ క్యాడర్‌లో నిరాశ పెరిగిన నేపథ్యంలో, పూర్వ వైభవాన్ని సాధించడానికి జగన్ విభిన్న ప్రయత్నాలు చేస్తున్నారు.

ఈ క్రమంలో 'ఘర్ వాపసీస అంశాన్ని ప్రస్తావి స్తున్నారు. దీంతో 'ఘర్ వాపసీ'పై ఆశలు పెరుగుతున్నాయి. పాత కాపుల కలయికకు ప్రాధాన్యం ఇస్తున్నారు. గతంలో వైఎస్ కుటుంబానికి అత్యంత సన్నిహితంగా ఉండి, వివిధ కారణాల వల్ల పార్టీని వీడిన లేదా దూరంగా ఉన్న సీనియర్ నేతలను, అలాగే తటస్థంగా ఉన్న పాత నాయకులను తిరిగి పార్టీలోకి తీసుకురావడానికి వైసీపీ ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. క్షేత్రస్థాయిలో బలమైన పట్టున్న పాత నేతలు తిరిగి వస్తే, నిరాశలో ఉన్న నియోజకవర్గ స్థాయి క్యాడర్‌లో సరికొత్త ఉత్సాహం వస్తుందని పార్టీ భావిస్తోంది.

మరోవైపు.. రాజకీయ వర్గాల్లో కాంగ్రెస్, వైసీపీల మధ్య భవిష్యత్తులో ఏదైనా రాజకీయ సమన్వయం లేదా విలీనం వంటి 'ఘర్ వాపసీ' జరుగుతుందా అనే చర్చలు కూడా తెరపైకి వస్తున్నాయి. అయితే ప్రాంతీయ అస్తిత్వాల రీత్యా ఇవి అంత సులభం కాదని విశ్లేషకులు చెబుతున్నారు. వైసీపీ శక్తిమంతం కావడానికి ఉన్న సవాళ్లు కూడా ఎక్కువగానే కనిపిస్తున్నాయి. 2024 ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత పలువురు ముఖ్య నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు అధికార కూటమి వైపు మళ్లారు.

స్థానిక సంస్థల ఎన్నికల వేళ వైసీపీలో ఆందోళనకు ఇది కారణమైంది. పార్టీకి పెద్ద సవాలుగా మారింది. దీంతో కేవలం నాయకులు తిరిగి రావడం మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల్లో కోల్పోయిన నమ్మకాన్ని, ముఖ్యంగా మధ్యతరగతి, యువతలో పార్టీపై ఉన్న వ్యతిరేకతను పోగొట్టుకోవడం అత్యవసరమని భావిస్తున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో లేదా పరిపాలనలో విఫలమైతే, ఆ ప్రజా వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకోవడానికి బలమైన ప్రతి పక్షంగా వైసీపీకి అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఏదేమైనా.. ప్రస్తుతం దీనిపై భారీగానే కసరత్తు చేస్తున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## తుని రైల్వే స్టేషన్‌లో 13 కేజీల గంజాయి పట్టివేత

**జనరల్ కోచ్‌లో ప్రయాణిస్తున్న ఇద్దరు అరెస్ట్**
**రైల్వే పోలీసుల తనిఖీల్లో బయటపడిన మాదకద్రవ్యాలు**

**తుని, విశ్వం వాయిస్ న్యూస్ :** దిశ, తుని.. రైలులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని తుని రైల్వే పోలీసులు, ఆర్పీఎఫ్ సిబ్బంది సంయుక్తంగా పట్టుకున్నారు. శుక్రవారం సాయంత్రం తుని రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన తనిఖీల్లో ఇద్దరి వద్ద నుంచి సుమారు 13 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. భువనేశ్వర్ నుంచి బెంగళూరు వైపు ప్రయాణిస్తున్న సుభద్ర సమాల్ (19), దీపక్ కుమార్ (24) హౌరా–చెన్నై మెయిల్ రైలులోని జనరల్ కోచ్‌లో ప్రయాణిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద గంజాయి ఉన్నట్లు ఆర్పీఎఫ్ అధికారులకు విశ్వసనీయ సమాచారం అందడంతో తుని రైల్వే స్టేషన్‌లో అప్రమత్తమయ్యారు. రైలు తుని స్టేషన్‌కు చేరుకున్న అనంతరం ప్లాట్‌ఫాం నంబర్–1పై అధికారులు, సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇద్దరి లగేజ్ బ్యాగులను పరిశీలించగా అందులో గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరినీ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, తుని జీఆర్పీ ఎస్ఐ వి. సత్తిబాబు, ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పాల్గొన్నారు. గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోవడంలో సమర్థవంతంగా పనిచేసిన సిబ్బందిని కాకినాడ లైన్స్ ఇన్‌స్పెక్టర్ టి.శ్రీనివాసరెడ్డి అభినందించారు.

## మంగళగిరిలో నకిలీ మద్యం అంటూ తప్పుడు ప్రచారం

**యాప్ ఇన్‌స్టాల్ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి బాటిల్ నకిలీదంటూ ప్రచారం**
**బాటిల్ క్యాప్‌పై ఉన్న వెరిఫికేషన్ క్యూఆర్ కోడ్‌నే స్కాన్ చేయాలి**

**మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** మంగళగిరిలోని లిక్కర్ మార్ట్‌లో విక్రయించిన బ్లెండర్స్ ప్రైడ్ మద్యం బాటిల్ నకిలీదంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఎక్సైజ్ శాఖ ఖండించింది. వైరల్‌గా మారిన వీడియోలో బాటిల్ ప్రామాణికతను నిర్ధారించే క్యూఆర్ కోడ్‌ను కాకుండా, ఇప్పటికే మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్న ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌కు సంబంధించిన ఇన్‌స్టాలేషన్ క్యూఆర్ కోడ్‌ను మరోసారి స్కాన్ చేయడంతో ఎర్రర్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్న వినియోగదారులు అదే యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడానికి ఉద్దేశించిన క్యూఆర్ కోడ్‌ను మళ్లీ స్కాన్ చేస్తే ఎర్రర్ సందేశం కనిపిస్తుందని అధికారులు స్పష్టం చేశారు. దీనిని బాటిల్ నకిలీదనానికి ఆధారంగా పరిగణించరాదని తెలిపారు. మద్యం బాటిల్ ప్రామాణికతను తెలుసుకోవాలంటే బాటిల్ క్యాప్ లేబుల్‌పై ప్రత్యేకంగా ఉన్న వెరిఫికేషన్ క్యూఆర్ కోడ్‌ను ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా స్కాన్ చేయాలని సూచించారు. ఆ విధంగా స్కాన్ చేసినప్పుడే బాటిల్‌కు సంబంధించిన వివరాలను పరిశీలించి దాని ప్రామాణికతను నిర్ధారించుకోవచ్చని అధికారులు తెలిపారు. సరైన వెరిఫికేషన్ ప్రక్రియను పాటించకుండా యాప్ ఇన్‌స్టాలేషన్ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వచ్చిన "క్యూఆర్ కోడ్ నాట్ ఫౌండ్/ఎర్రర్" సందేశాన్ని ఆధారంగా చేసుకుని బాటిల్ నకిలీదంటూ ప్రచారం చేయడం నిరాధారమని ఎక్సైజ్ శాఖ పేర్కొంది. ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే ఇటువంటి వీడియోలను చూసి అపోహలకు గురికావద్దని, మద్యం బాటిల్‌పై అనుమానం ఉంటే క్యాప్ లేబుల్‌పై ఉన్న నిర్దిష్ట వెరిఫికేషన్ క్యూఆర్ కోడ్‌ను ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌లో స్కాన్ చేసి మాత్రమే నిర్ధారించుకోవాలని అధికారులు సూచించారు.

## పూరి గుడిసె కూలి బాలుడి మృతి



**తాళ్లరేవు, విశ్వం వాయిస్ న్యూస్ :** తాళ్లరేవు మండలం గాడిమొగ పంచాయతీ చినవలసలో విషాదం చోటుచేసుకుంది. స్థానికుల వివరాలు.. మల్లాడి జయకు ఇద్దరు పిల్లలు. భర్త మూడేళ్ల క్రితం మృతిచెందడంతో ఆమె కూలి పనులు చేసుకుంటూ పిల్లలను పోషిస్తోంది. ఆమె కుమారుడు లక్ష్మీనారాయణ (12) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం ఇంటికి వస్తుండగా శిథిలావస్థలో ఉన్న పూరి గుడిసె ఒక్కసారిగా కూలి బాలుడిపై పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

## యానాం మద్యం స్వాధీనం




**ఐ.పోలవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం పాత ఇంజరం పోలీస్ స్టేషన్ వద్ద యానాం మద్యం తో పాటు ముగ్గురు వ్యక్తులను పోలీసులు ఒక కారు స్వాధీనం చేసుకున్నారు. పుదుచ్చేరీ యానాం నుండి కృష్ణా జిల్లాకు అక్రమంగా ఓ కారులో మద్యం తరలిస్తుండగా పట్టుకున్న ఐ. పోలవరం ఎస్సై ఎంవివి రవీంద్రబాబు సిబ్బంది, వివిధ రకాల 36 మద్యం బాటిల్స్, కారు స్వాదీనం... కృష్ణా జిల్లా గుడ్లవల్లేరుకు చెందిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.



# క్లిష్టమైన వ్యాధులకు కోతల్లేని శాశ్వత పరిష్కారం.. యశోద ఆధునిక వైద్యం!

- జీర్ణాశయ, రక్త సంబంధిత సమస్యలకు అత్యాధునిక చికిత్సలు
- యశోద హైటెక్ సిటీ వేదికగా ప్రపంచస్థాయి వైద్య సేవలు
- రోబోటిక్, లాప్రోస్కోపిక్ విధానాలతో వేగవంతమైన కోలుకునే అవకాశం
- ప్రాణాంతక క్యాన్సర్లకు ఆధునిక పద్ధతుల్లో మెరుగైన వైద్యం
- చిన్నపాటి కోతలతోనే అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సలు పూర్తి
- రక్తహీనత, లుకేమియా వంటి సమస్యలకు అధునాతన స్టెమ్ సెల్ చికిత్స
- వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే ప్రాణాపాయం దూరం
- విశేష అనుభవం, అంతర్జాతీయ కీర్తి గడించిన వైద్య నిపుణుల సేవలు
- బీమా సదుపాయంతో సామాన్యులకు సైతం అందుబాటులో కార్పొరేట్ వైద్యం




**పాలకొల్లు, సెప్టెంబర్ 25, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆధునిక జీవనశైలి మార్పుల నేపథ్యంలో ప్రజల ఆరోగ్యం పెను సవాళ్లను ఎదుర్కొంటోంది. ముఖ్యంగా రక్త సంబంధిత, జీర్ణాశయ వ్యాధులు వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరినీ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇటువంటి సంక్లిష్టమైన ఆరోగ్య సమస్యలకు అత్యుత్తమ ప్రపంచస్థాయి వైద్య సేవలను అందించడంలో యశోద హైటెక్ సిటీ బృందం అగ్రగామిగా నిలుస్తోంది. ప్రాణాంతకమైన వ్యాధులను సైతం ప్రాథమిక దశలోనే పసిగట్టి, అత్యాధునిక సాంకేతికతతో కూడిన వైద్య విధానాల ద్వారా సంపూర్ణ స్వస్థత చేకూర్చవచ్చని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు వేదికగా శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక పాత్రికేయుల సమావేశంలో యశోద ఆసుపత్రికి చెందిన సుప్రసిద్ధ వైద్యులు పాల్గొని పలు కీలక విషయాలు వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో విశేష అనుభవం గడించి, ఎన్నో క్లిష్టమైన కేసులను ఛేదించి వేలాది ప్రాణాలను కాపాడిన యశోద ఆసుపత్రుల సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ కృష్ణ చౌదరి, హెమటాలజిస్ట్ డాక్టర్ ఫరాజ్ అహ్మద్ ఈ వైద్య సదస్సులో తమ అపారమైన పరిజ్ఞానాన్ని పంచుకున్నారు. జీర్ణాశయ వ్యవస్థలో తలెత్తే అనారోగ్య సమస్యలకు పాతకాలపు పద్ధతులకు స్వస్తి పలుకుతూ ప్రస్తుతం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. డాక్టర్ కృష్ణ చౌదరి తన సుదీర్ఘ ప్రస్థానంలో అనేక సంక్లిష్టమైన ఆపరేషన్లను అత్యంత సునాయాసంగా విజయవంతం చేసి ఎంతోమందికి పునర్జన్మ ప్రసాదించారు. కడుపు, పేగులు, కాలేయం, ప్యాంక్రియాస్, పిత్తాశయం వంటి అవయవాలకు సంబంధించిన వ్యాధుల చికిత్సలో యశోద హైటెక్ సిటీ ప్రమాణాలు అద్వితీయం. గంటల తరబడి సాగే పెద్దపెద్ద ఆపరేషన్లను సైతం అడ్వాన్స్‌డ్ లాప్రోస్కోపిక్, రోబోటిక్ సర్జరీల ద్వారా చాలా తక్కువ సమయంలో పూర్తి చేసే అసమాన సామర్థ్యం యశోద ఆసుపత్రుల సొంతం. సాంప్రదాయ ఓపెన్ సర్జరీల మాదిరిగా కాకుండా, ఈ అధునాతన విధానాల్లో శరీరంలో కోతలు అతి చిన్నవిగా ఉంటాయి. దీనివల్ల బాధితులకు ఆపరేషన్ తర్వాత వచ్చే తీవ్రమైన నొప్పి, అసౌకర్యం దరిచేరవు. అత్యంత కచ్చితత్వంతో క్లిష్టమైన భాగాల్లో శస్త్రచికిత్స చేయడం రోబోటిక్ సర్జరీ ప్రత్యేకత. ఆసుపత్రిలో రోజుల తరబడి పడకకే పరిమితం కాకుండా, అతి తక్కువ వ్యవధిలోనే డిశ్చార్జి అయి తమ రోజువారీ పనులకు హాజరయ్యే వెసులుబాటు ఈ ఆధునిక చికిత్సల ద్వారా సాధ్యమవుతోంది. అయితే రోగి ఆరోగ్య పరిస్థితి, వ్యాధి తీవ్రతను నిశితంగా పరిశీలించిన తర్వాతే ఏ తరహా ఆపరేషన్ చేయాలనేది నిపుణులైన వైద్య బృందం నిర్ధారిస్తుంది. ఇలాంటి ఖరీదైన వైద్య సేవలను సైతం ఆరోగ్య బీమా కవరేజ్ ద్వారా సామాన్యులు కూడా సద్వినియోగం చేసుకునే అవకాశం ఉందని వైద్యులు వివరించారు. మరోవైపు రక్త సంబంధిత సమస్యలు నేడు తీవ్ర కలకలం రేపుతున్నాయి. రక్తహీనత నుంచి మొదలుకొని రక్తం గడ్డకట్టే స్వభావంలో లోపాలు, ప్లేట్‌లెట్ క్షీణత, తెల్ల రక్తకణాల సమస్యలు, లుకేమియా, లింఫోమా, మల్టిపుల్ మైలోమా లాంటి తీవ్రమైన ప్రాణాంతక క్యాన్సర్లు వివిధ వయసుల వారిని పట్టిపీడిస్తున్నాయి. ఈ వైద్య రంగంలో విశేషమైన ఖ్యాతి గడించిన డాక్టర్ ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ, శరీరంలో కనిపించే చిన్నపాటి మార్పులను సైతం ఏమాత్రం అశ్రద్ధ చేయకూడదని హెచ్చరించారు. నిరంతర అలసట, కారణం లేకుండా బరువు తగ్గిపోవడం, చర్మం పాలిపోవడం, అకారణ రక్తస్రావం, చర్మంపై నీలిరంగు మచ్చలు, మెడ లేదా చంకల్లో కణితులు వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణం అప్రమత్తం కావాలి. ఈ లక్షణాలన్నీ క్యాన్సర్ కే దారితీయకపోయినా, వైద్య పరీక్షల ద్వారా అసలు మూలాలను గుర్తించడం ఎంతో అవసరం. యశోద ఆసుపత్రిలో ఇలాంటి సంక్లిష్ట వ్యాధులను పసిగట్టడానికి అత్యాధునిక రక్త, ఎముక మజ్జ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. వ్యాధి దశను బట్టి కచ్చితమైన కీమోథెరపీ, ఇమ్యునోథెరపీ వంటి టార్గెటెడ్ చికిత్సలతో పాటు అవసరమైన వారికి మూలకణాల మార్పిడి (బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్) వంటి ప్రపంచ స్థాయి ట్రాన్స్‌ప్లాంట్ సేవలను యశోద అద్భుతంగా అందిస్తోంది. వ్యక్తిగత ఆరోగ్య నివేదికలు, జన్యుపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని సరైన సమయంలో చికిత్సను ప్రారంభిస్తే ప్రాణాపాయాన్ని పూర్తిగా అదుపు చేయవచ్చని వైద్యులు భరోసా ఇస్తున్నారు. ఏవైనా లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే వైద్యులను సంప్రదించడం వల్ల ప్రాణాలను కాపాడుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వెంకటేశ్వరావు రావు వీరంకీ, మార్కెటింగ్ మేనేజర్ బాల వీరభద్ర నల్లం, పశ్చిమ గోదావరి జిల్లా అసిస్టెంట్ మార్కెటింగ్ మేనేజర్ బి లక్ష్మణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఐదు రోజుల బ్యాంకింగ్

# అమలు చేయాలి

సమాన ప్రోత్సాహక పథకం వర్తింపజేయాలని బ్యాంకు ఉద్యోగుల ధర్నా




**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 25, విశ్వం వాయిస్ న్యూస్ :** బ్యాంకు ఉద్యోగులు, అధికారుల ప్రధాన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో గురువారం రాజమహేంద్రవరంలోని కంబాల చెరువు వద్ద స్టేట్ బ్యాంకు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 400 మంది బ్యాంకు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఐదు రోజుల బ్యాంకింగ్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. బ్యాంకుల్లో వారానికి ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయడం ద్వారా ఉద్యోగులకు విశ్రాంతి, కుటుంబ సమయంతో పాటు పని సామర్థ్యం కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం, బ్యాంకుల యాజమాన్యాలు తక్షణ నిర్ణయం తీసుకోవాలని కోరారు. అలాగే బ్యాంకు ఉద్యోగులందరికీ సమానంగా పనితీరు ఆధారిత ప్రోత్సాహకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల మధ్య వివక్ష లేకుండా సమాన ప్రాతిపదికన ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. బ్యాంకు ఉద్యోగులు, అధికారుల సమస్యలను పరిష్కరించడంలో సంబంధిత యాజమాన్యాలు, ప్రభుత్వం చొరవ చూపాలని నాయకులు కోరారు. ధర్నాకు నేషనల్ కాన్ఫెడరేషన్ బ్యాంక్ ఎంప్లాయీస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఎల్. చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. ఉద్యోగుల సమస్యలపై సంఘాలు చేపడుతున్న పోరాటం, భవిష్యత్ కార్యాచరణను వివరించారు. కార్యక్రమాన్ని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ నాయకులు టి. శేషుకుమార్, బి. పాపారావు, ఎం.ఎస్.ఎన్. రాజు, డి.ఎస్. పేరిశాస్త్రి, ఎ.రాజేష్, డి.వి. ప్రసాద్ తదితరులు నిర్వహించారు. డిమాండ్లపై ప్రభుత్వం, బ్యాంకుల యాజమాన్యాలు స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు తెలిపారు. ఇందులో భాగంగా సెప్టెంబరు 28, 29, 30 తేదీల్లో మూడు రోజుల దేశవ్యాప్త సమ్మె నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అయినప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే అక్టోబరు 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నట్లు వెల్లడించారు. బ్యాంకింగ్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారుల సమస్యలను పరిష్కరించి, సమ్మె పరిస్థితి రాకుండా ప్రభుత్వం, యాజమాన్యాలు చర్చలు జరిపి తక్షణ నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు.

క్షేత్రస్థాయిలో పర్యటించి

# వరదనష్టాన్ని అంచనా వేయండి : బత్తుల

త్రాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ – జలకళతో కళకళలాడుతున్న వాగులు వంకలు



**కోరుకొండ, సెప్టెంబర్ 25, విశ్వం వాయిస్ న్యూస్ :** వరదల కారణంగా నిరాశ్రయులైన బాధితులను ప్రభుత్వం అన్నివిధాల ఆదుకుంటుందని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ అన్నారు. శుక్రవారం కోరుకొండ ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని వరద నష్టంపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ కోరుకొండ మండలంలో ప్రస్తుతం 1,200 ఎకరాలు, సీతానగరం మండలంలో 1,300 ఎకరాలు ముంపుకు గురైనట్లు తెలిపారు. శ్రీరంగపట్నంలో రెండు గృహాలు, బూరుగుపూడి ఒకటి, రాజవరం ఒకటి గృహాలు పక్షంగా దెబ్బతిన్నాయని, బాధితులకు ప్రభుత్వ సహాయం అందేటట్లు చూడాలని అధికారులను ఆదేశించారు. మరో రెండు రోజుల్లో నీరు పూర్తిగా తగ్గిన తర్వాత రెవెన్యూ, హార్టికల్చర్, వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, ఆస్తి పంటనష్టాన్ని అంచనా వేసి ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. గ్రామాల్లో త్రాగునీరు, పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. వైద్యసిబ్బంది గ్రామాల్లో పర్యటించి ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్నినో ప్రభావంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా, మనకు వర్ణుడు కరుణించడంతో నియోజకవర్గం జలకలతో కళకళలాడుతుందన్నారు. వరదల కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బత్తిన అశోక్ కుమార్, తాసిల్దార్ సునీత, వ్యవసాయశాఖ అధికారులు రామ తులసి, హౌసింగ్ ఏఈ రమణ, జనసేన పార్టీ నాయకులు అడ్డాల శ్రీను,యర్రంశెట్టి పోలారావు, అడపా శ్రీనివాస్, తన్నీరు తాతాజీ, జాజుల గణేష్, మట్టా నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఈ నెల 27న కాతేరులో బీసీ గర్జనపై చర్చ

జక్కంపూడి రాజాను మర్యాదపూర్వకంగా కలిసిన బీసీ వర్కింగ్ ప్రెసిడెంట్



**సీతానగరం, సెప్టెంబర్ 25, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను ఆ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నౌడు వెంకట రమణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీతానగరంలో పార్టీ నాయకుడు పెదపాటి రమేష్ బాబు (డాక్టర్ బాబు) స్వగృహంలో ఈ భేటీ జరిగింది.ఈ సంద ర్భంగా జక్కంపూడి రాజా ను నౌడు వెంకట రమణ శాలువాతో సత్కరించారు. అనంతరం వెంకటరమణను జక్కంపూడి రాజా శాలువా తో సత్కరించారు. ఈ నెల 27న రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు వెంకటాద్రి గార్డెన్స్‌లో నిర్వ హించనున్న బీసీ గర్జన కార్యక్రమం ఏర్పాట్లపై వారు చర్చించారు. బీసీలకు కూటమి ప్రభుత్వం చేసిన అన్యాయాలు, ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు కొండ పల్లి దుర్గారావు, సీతానగ రం ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల అధ్యక్షుడు గంటా శ్రీనివా సరావు, పెదపాటి రమేష్ బాబు (డాక్టర్ బాబు), కవల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.






# వరద ముంపును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పటిష్ట చర్యలు

## రాబోయే మూడు రోజుల్లో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు అధికారులకు జేసీ నైడియా దేవి ఆదేశాలు

**అమలాపురం, సెప్టెంబర్ 25, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో రాబోయే వరద ముంపు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నైడియా దేవి అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. శుక్రవారం అమలాపురం కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ నైడియా దేవి జిల్లా స్థాయి వివిధ శాఖల అధికారులతో కలిసి అన్ని మండలాల తహాశీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాలు, వరద ముంపునకు గురయ్యే మండలాల్లో ప్రస్తుత పరిస్థితిపై ఆయా మండలాల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరద ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం, వైద్య శిబిరాలు నిర్వహించడం, తాగునీరు, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడటం తదితర అంశాలపై క్షేత్రస్థాయి సిబ్బందికి జేసీ దిశా నిర్దేశం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి



సురక్షిత ప్రాంతాలకు తరలించాలని నైడియా దేవి సూచించారు. వర్షాలు తగ్గినప్పటికీ వరద ముంపు పొంచి ఉన్నందున జిల్లా అధికార యంత్రాంగం పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు. మొదటి, రెండో హెచ్చరిక స్థాయిల్లో ఏయే గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందో ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ముంపు బాధితుల కోసం ఏర్పాటు చేసే పునరావాస కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర సేవల్లో భాగంగా గర్భిణులు, బాలింతలు, వృద్ధులను ముందుగానే గుర్తించి ఎలాంటి ప్రమాదం జరగకుండా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. లంక గ్రామాల్లో నివసించే ప్రజలతో పాటు పశువులను కూడా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. వరద సమయంలో పశువులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన దాణా, పశు వైద్య సదుపాయాలు కల్పించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి వి.సుబ్బారావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి కె.నాగలక్ష్మి, వైద్య ఆరోగ్యం, మత్స్య, పంచాయతీ, విద్య, ఇరిగేషన్, డ్రైనేజీ తదితర శాఖల జిల్లా స్థాయి అధికారులు, అన్ని మండలాల తహాశీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే బత్తుల

- వరద ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశం
- రైతులకు పంట నష్టపరిహారం, బాధితులకు పునరావాస కేంద్రాల్లో మెరుగైన వసతులు కల్పించాలి
- పొలాల్లో, కాలనీ ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా ఎప్పటి కప్పుడు డీ వాటరింగ్ చేసేలా చర్యలు చేపట్టాలి
- పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు ఆహారం, మంచినీరు, వైద్యం ఎప్పటికప్పుడు అందించాలి
- వాగులు, వంకలు, చెరువులు పొంగి పొర్లడంపై పంటనష్టంపై ఆరా

**రాజానగరం, సెప్టెంబర్ 25, విశ్వం వాయిస్ న్యూస్ :** గత రెండు రోజులుగా తీవ్ర వాయుగుండం ప్రభా వంతో రాజానగరం నియోజకవర్గం వ్యాప్తంగా అలానే ఏజెన్సీ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టే వరకు లోతట్టు ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణకు రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆదేశాలు జారీ చేశారు.ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు, లోతట్టు ప్రాంతాల పరిస్థితి, చెరువులు, వాగుల్లో నీటి మట్టాలు, విద్యుత్ సరఫరా, త్రాగునీరు వ్యవస్థ, పంట నష్టం, పశువుల నష్టం తదితర అంశాల విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో, కాలనీలో నిరంతరం పర్యవేక్షించాలని అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పారిశుధ్య నిర్వహణకు అంతరాయం లేకుండా లోతట్టు ప్రాంతాల్లో నీరు ఎక్కువ రోజులు నిల్వ లేకుండా పరికరాలు ఉపయోగించి ఎప్పటికప్పుడు డీ వాటరింగ్ చేయాలని సూచించారు.ఈదురుగాలులు కారణంగా రహదారులకై కూలిన చెట్లను చాలా వరకు తొలగించారు, ఇంకా ఏమైనా ఉన్నాయేమో పరిశీలించాలని ఆదేశించారు.విద్యుత్ సరఫరా, త్రాగునీరు సరఫరా లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.కోరుకొండ మండలం ఎంపీడీఓ, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ , హార్టీ కల్చర్, అగ్రికల్చర్, వెటర్నరీ అధికారులకు సూచనలు చేశారు.ప్రజల నుండి తుఫాన్ కు సంబంధించి అర్జీలు స్వీకరించి ఆయా గ్రామాల అధికారులను సంప్రదించి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశాలు జారీ చేసారు.కోరుకొండ మండలం ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుండి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రజలకు అందుబాటులో ఉంటూ భారీ వర్షాల నేపథ్యంలో అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ...గత మూడు రోజులగా వర్షాలు విపరీతంగా పడుతున్నాయో, ఒక పక్కన సంతోషం, రైతుల కళ్లల్లో ఆనందం ఒక పక్కన ఉంటే, మరో పక్కన రైతు సోదరులు భయపడుతున్న సందర్భం. మరో పక్క పాత కాలం నాటి ఇల్లు ఉన్నాయో, వాళ్లు కూడా భయాందోళనలకు గురవుతున్న పరిస్థితి ఉంది.ప్రపంచ వ్యాప్తంగా ఎల్ నినో ప్రభావం వల్ల పంటలు లేక, తాగడానికి నీళ్లు లేక, బోర్లలో నీళ్లు ఇంకిపోయి అతలాకుతలం అయిపోతున్నటువంటి పరిస్థితుల్లో వరుణుడు వర్షించి, కనికరించి కరువు లేకుండా ప్రజలకు అందరికీ కూడా మంచి వర్షాలని ఇచ్చి చెరువులు, నదులు, వాగులు, వంకలు అన్నీ కూడా నిండుకుండలా కళకళలాడుతూ ఉన్నాయి.ఈ వర్షాలు ఎక్కువ అవ్వడం వల్ల వరదలు రావడం వల్ల ముఖ్యంగా శ్రీరంగపట్నం గ్రామంలో సుమారుగా ఒక 300 కుటుంబాల వరకు డ్రైనేజీ నీరు ముందుకు వెళ్లకపోవడం వల్ల, నీళ్లు కిందకి వెళ్లకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారు. ఎంఆర్ఓ,నిన్ననే స్పందించి వాళ్లందరినీ కూడా పునరావాస కేంద్రాలకు తరలించి వాళ్లకు వంట చేసుకోవడానికి కావలసిన సరుకులన్నీ కూడా తహాశీల్దార్ కూడా అందజేయడం జరిగింది ఎంపీడీఓ కూడా పూర్తి స్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఈరోజు మధురపూడిలో ఒక గేదె చనిపోయింది. గేదె కట్టేసి ఉండడం వల్ల కాలవ నీరు రావడం వల్ల ఆ గేదె నీటిలో మునిగిపోయి ఊపిరి ఆడక చనిపోవడం జరిగింది. దానికి పశు వైద్యులు కూడా వెళ్లి ఇప్పుడు పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు.బూరుగుపూడిలో ఒక చిన్నపాటి ఇల్లు కొంచెం భాగం దెబ్బతిని గోడ పడిపోవడం కూడా జరిగింది. దానిని నేను, ఇప్పుడు ఎంపీడీఓ అలాగే ఎంఆర్ఓ, కూడా ముగ్గురం వెళ్లి పరిశీలిస్తాం.శ్రీరంగపట్నంలో కూడా రెండు ఇళ్ల వరకు కూడా చిన్న భాగం దెబ్బతిని కొంతవరకు పడిపోయినట్లుగా మనకి సమాచారంచ్చింది. రాజవరంలో కూడా ఒక పూరి ఇంటి చిన్న గోడ కూడా పడిపోవడం జరిగింది. ఇవన్నీ కూడా మేము పరిశీలించి ప్రభుత్వానికి తహాశీల్దార్ నివేదిక కూడా పంపించి దాని ప్రకారం వాళ్లకి నష్టపరిహారం వచ్చేటట్టుగా కూడా ప్రయత్నం చేస్తామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ హామీ ఇచ్చారు.వర్షాలు తగ్గిన అనంతరం ఎక్కడెక్కడ నష్టాలు జరిగాయో పరిశీలించి ఆ నష్టపోయిన వాటికి నష్టపరిహారం వచ్చే విధంగా తహాశీల్దార్, ప్రయత్నం చేస్తారు, నేను చేస్తాను, కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లి వాళ్లందరికీ న్యాయం చేస్తాం. వ్యవసాయంలో పంటలన్నీ కూడా మునిగిపోవడం జరిగాయి. కోరుకొండ మండలంలోనే 1200 ఎకరాల వరకు మునిగిపోయింది.నరసాపురం 120 ఎకరాలు, కోరుకొండలో 250 ఎకరాలు, శ్రీరంగపట్నంలో 120 ఎకరాలు, దోసకాయపల్లిలో 200 ఎకరాలు, నిడిగట్లలో 30 ఎకరాలు, బూరుగుపూడిలో 180 ఎకరాలు, జగన్నాథపురం, గుమ్ములూరు లో 30 ఎకరాలు, చిన్నకొండేపూడి, రాపాక, ఉండేశ్వరపురం, మిర్తిపాడు ఇలా కొన్ని గ్రామాల్లో



సుమారుగా 1300 ఎకరాలు మునిగినట్లుగా కూడా ఇప్పటివరకు సమాచారం వచ్చింది.ఏజెన్సీ ప్రాంతాల్లో కురిసినటువంటి వర్షాల వల్ల అక్కడ వచ్చినటువంటి వరద ఇప్పుడు మన ప్రాంతానికి వస్తుంది. ముఖ్యంగా సీతానగరం, కోరుకొండ మీద ప్రభావం చూపించే అవకాశం ఉంది. ఎంతవరకు పొలాలు మునిగిపోతాయి అనేది చూసి వాటిని కూడా వ్యవసాయ శాఖ వారు కూడా పూర్తి స్థాయిలో వాటన్నింటినీ కూడా పరిశీలిస్తున్నారు. దాన్ని పరిశీలించి ప్రభుత్వానికి ఒక నివేదిక తయారుచేసి ఆ రైతులకు ఎంత మేరకు పంట నష్టపోయిందో చూసి ప్రతి ఒక్క రైతుకు నష్టపరిహారం అందించే విధంగానూ తమవంతు ప్రయత్నాలు చేస్తామన్నారు. ఉద్యానవన శాఖ వారు పూర్తి స్థాయిలో రెండు మండలాల్లో కూడా పర్యవేక్షిస్తున్నారు. ఒక ఉండేశ్వరపురంలో మాత్రం ఈ యొక్క బొబ్బాయి తోట మునిగిపోవడం జరిగింది. అరటి తోటలు గాని, కూరగాయలు, పండ్ల తోటలు ఎంతవరకు దెబ్బతిన్నాయో కూడా ఈ రెండు రోజుల్లో పరిశీలించి ఇదంతా కూడా ఉద్యానవన శాఖలో ఎంత నష్టం వాటిల్లింది, వ్యవసాయంలో ఎంత నష్టం వాటిల్లింది, ఇళ్లు పడిపోవడంలో ఎంత నష్టం వాటిల్లింది అనేది పూర్తి స్థాయిలో నివేదిక తయారుచేసి కలెక్టర్కి, ముఖ్యమంత్రికి, ఉప ముఖ్యమంత్రి, దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం వచ్చేటట్టు మేము ప్రయత్నం చేస్తాం. అలాగే పూర్తి స్థాయిలో మనకి తహాశీల్దార్ గాని మండల డెవలప్‌మెంట్ ఆఫీసర్, గాని ఇక్కడ 24 గంటలు అందుబాటులో ఉండి ప్రజలకి ఈ పునరావాస కేంద్రాలని కూడా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వాళ్ళకి కావలసినటువంటి వైద్య సదుపాయాలు గాని, ఆహారం ఏ విధమైన ఇబ్బంది పడకుండా వాళ్ళకి ఉండడానికి నివాసానికి కూడా ఇబ్బంది లేకుండా పరిశీలిస్తున్నారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేవు. మరో రెండు రోజులు కూడా దీని పూర్తి స్థాయిలో పరివేక్షణలో అధికారులందరూ కూడా అప్రమత్తంగా ఉండి నష్టపరిహారం అవసరం అవుతుంది, ఎక్కడ నష్టం వాటిల్లిందో పరిశీలించి దాని ప్రకారంచర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలియచేశారు..ఇప్పుడు కూడా ఎవరికైనా ఇల్లు గాని పడిపోయినట్లుగాని ఉంటే, ఇప్పుడు తాను తహాశీల్దార్ , మండల డెవలప్‌మెంట్ ఆఫీసర్ కూడా శ్రీరంగపట్నం అలాగే బూరుగుపూడి దీని తర్వాత మధురపూడి కూడా మేము పరిశీలించడానికి వెళ్తున్నామని ఈ లోపల ఇంకేదైనా సమాచారం వస్తే కూడా ఆ గ్రామాలను కూడా పరిశీలించి అవసరమైన వాళ్ళకి ఖచ్చితంగా తక్షణ సహాయం అందజేస్తామన్నారు. అలాగే పునరావాస కేంద్రాలకు గాని వాళ్ళని తరలించాల్సి వస్తే కూడా ఆ విధంగా కూడా చర్యలు తీసుకుంటాం. వైద్య సదుపాయాలు కూడా అందుబాటులోకి తీసుకొచ్చాం, ఎక్కడికక్కడ హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేసాము. వైద్యం విషయంలో కూడా ఇబ్బంది లేకుండా చేస్తున్నాం. ఇప్పుడే ఆర్ డబ్ల్యూఎస్ వాళ్ళతో కూడా మాట్లాడాం, డ్రైనేజీ ఎక్కడైనా బ్లాక్‌లో ఉంటే కూడా వెంటనే యాక్షన్ తీసుకోమని చెప్పాము. మైనర్ ఇరిగేషన్ అధికారులు కూడా ఇక్కడే ఉన్నారు, వారితో కూడా మాట్లాడాం. ఎక్కడైనా వాటర్ చెరువుల్లో గాని ఎక్కడైనా గాని ఓవర్‌ఫ్లో అవుతుంటే గండ్లు కొట్టేసే పరిస్థితులు ఉంటే శాండ్ బ్యాగ్స్ వేసి వాటిని ఫిల్ చేసి గండ్లు పడకుండా చూసే విధంగా చూస్తున్నాం. ఎవరికి ఎలాంటి ఏ ఇబ్బంది వచ్చినా మమ్మల్ని, తహాశీల్దార్ని గాని, మండల అధికారి వారిని గాని, మండల డెవలప్‌మెంట్ ఆఫీసరిని గాని సంప్రదిస్తే ఎవరైనా సరే ప్రజలకు ఏదైనా అసౌకర్యం జరిగితే సీతానగరంలో గాని, కోరుకొండలో గాని, రాజానగరంలో గాని అధికారులు అందుబాటులో ఉన్నారు వాళ్ళని సంప్రదించవచ్చు. అలాగే తమ జనసేన నాయకులందరూ కూడా అందుబాటులో ఉన్నారు, నాతో సహా జనసైనికులు, వీర మహిళలు అందరూ అందుబాటులో ఉన్నారు. ఎక్కడ ఏ సమస్య ఉన్నా సరే జనసేన పార్టీ దృష్టికి గాని, అధికారుల దృష్టికి గాని తీసుకొస్తే వెంటనే మేము దానిని పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు.

### కొప్పాల శివ గంగూకు

# అక్షయ ఆర్థిక సహాయం



**రావులపాలెం, సెప్టెంబర్ 25, విశ్వం వాయిస్ న్యూస్ :** అయినవిల్లి మండలం అయినవిల్లి లంక గ్రామానికి చెందిన కొప్పడి శివగంగ వెంకటరమణ ఇల్లు కరెంట్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఇల్లు పూర్తిగా కాలిపోవడం జరిగింది కట్టుబట్టలతో ప్రాణాలతో బయటపడ్డారు మొత్తం అన్ని కాలిపోయిన వి అని సహాయం కోరగా అక్షయ సంస్థ నుంచి రూ.10000. రూపాయలు. కోలా గంగాభవాని రూ.10000. చిర్లవెంకట్ రెడ్డి, వెంకటేశ్వర సెల్ పాయింట్ 1000 రూపాయలు దండుప్రోలు పెద్దిరాజు 1000 రూపాయలు. మల్లాడి కనక వర్మ .1000 రూపాయలు చెక్క అప్పలరాజు 500. రూపాయలు కర్రీ సుజాత 500 రూపాయలు లంకె వెంకటేశ్వర్లు 500 రూపాయలు కొల్లూరి వెంకటలక్ష్మి 500 రూపాయలు కృష్ణా మెడికల్ షాప్ మూర్తి 500 రూపాయలు ఓలేటి కన్నయ్య 500 రూపాయలు మొత్తం 26000. రూపాయలు అయినవిల్లి లంక గ్రామం వెళ్లి అక్షయ సేవా సంస్థ సభ్యుల చేతుల మీదుగా కోప్పడి శివ గంగ వారి కుటుంబానికి అందజేయడం జరిగింది దీనికి సహకరించిన సభ్యులకి ఫ్రెండ్స్‌కి అందరికీ ధన్యవాదములు అని తెలియజేశారు.

### మున్సిపల్ షాపుల లీజుదారులు

# అద్దె బకాయిలను తక్షణమే చెల్లించాలి

## కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 25, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరపాలక సంస్థ వాణిజ్య సముదాయాలలోని షాపుల లీజుదారులు అద్దె బకాయిలను తక్షణమే చెల్లించాలని, లేకుంటే బకాయిదారుల షాపులను సీజ్ చేయడమే కాకుండా చట్టరీత్య తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. శుక్రవారం ఉదయం నగరపాలక అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. దానవాయిపేటలోని మునిసిపల్ కాంప్లెక్స్ ను సందర్శించి అక్కడ గల షాపుల వివరాలు, వాటి ఆదాయ వనరులు మొదలగు అంశాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొన్నారు. ప్రస్తుతం మొదటి అంతస్తులో నిర్వహిస్తున్న 12వ వార్డు సచివాలయాన్ని ప్రజల సౌకర్యార్థం క్రిందకు మార్చాలని సూచించారు. పైనున్న హాలును లీజుకిచ్చి ఆదాయ వనరులు పెంపొందించుటకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా కాంప్లెక్స్ నందలి పారిశుధ్య నిర్వహణ విధానము మెరుగుపరచే విధంగా చూడాలని, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే వాటిని పరిష్కరించాలని సూచించారు. నగరంలో ఇతర దుకాణ సముదాయాలను పరిశీలించి అవసరమైన చోట మరమ్మతులు చేయించాలని అన్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో వ్యాపారం చేయు ప్రతి ఒక్క షాపు యజమాని విధిగా ట్రేడ్ లైసెన్సు కలిగిఉండాలని పేర్కొన్నారు. నూతనంగా వ్యాపారం ప్రారంభించిన వారు, వ్యాపారం చేస్తూ లైసెన్స్ లేని వారు ట్రేడ్ లైసెన్స్ పొందుటకు మీమీ ప్రాంతంలోని శానిటరీ సెక్రటరీ, ఇన్స్పెక్టర్ లేదా సచివాలయ కార్యాలయంలో సంప్రదించి లైసెన్స్ పొందాలని సూచించారు. లేనిపక్షంలో సదరు షాపులకు నోటీసులు జారీ చేసి, సీజ్ చేయుట జరుగుతుందని తెలిపారు. అలాగే నగరపాలక సంస్థ వాణిజ్య సముదాయాలలోని షాపుల లీజుదారులు ఎటువంటి బకాయిలు లేకుండా ప్రతి నెల అద్దెలు చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని, అట్లు చెల్లించని వారిపై నిబంధనలకు అనుగుణంగా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. ఆయన వెంట అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, ఎస్ఈ రీటా, రెవిన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

# అడ్వకేట్ జనరల్‌తో గన్ని కృష్ణ భేటీ

## గ్రామాల విలీనం కేసుల పురోగతిపై చర్చ



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 25, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ తో గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ శుక్రవారం సమావేశం అయ్యారు. అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టులో అడ్వకేట్ జనరల్ ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా గన్ని భేటీ అయ్యారు.ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, గ్రామాల విలీనంపై ఉన్న కేసుల పురోగతిని ఆయన అడిగి తెలుసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమవుతున్న నేపథ్యంలో అడ్డంకిగా ఉన్న కేసుల్లో విచారణపై గన్ని పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వ పాలన, ఇతర అంశాలను ఈ సందర్భంగా చర్చించారు.

విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
కాకినాడ జిల్లా ఎడిషన్
శనివారం, 26 సెప్టెంబర్ 2026
www.viswamvoice.com





### తుఫాన్ దెబ్బకు ముంపుకు గురైన

# పంట పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే పంతం నానాజీ



**కాకినాడ రూరల్, సెప్టెంబర్ 25, విశ్వం వాయిస్ న్యూస్ :** 'అర్నబ్' తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప మండలం వాకాడ, వేళంగి, కూరాడ, వేములవాడ గ్రామాల పరిధిలో ముంపుకు గురైన పంట పొలాలను మరియు ఇరిగేషన్ కాలువలను అధికార యంత్రాంగంతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే నానాజీ.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాధిత రైతులతో నేరుగా మాట్లాడి ధైర్యం చెప్పారు. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కూటమి ప్రభుత్వం అన్నదాతలకు అన్ని విధాలా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. వరద నీరు సాఫీగా సాగిపోయేందుకు కాలువల వద్ద జేసీబీ (జీజదీ) యంత్రాలతో ముమ్మరంగా సాగుతున్న పనులను ఎమ్మెల్యే స్వయంగా పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే నీటి సంఘం అధ్యక్షులు, సొసైటీ అధ్యక్షులు ఎప్పటికప్పుడు కాలువలు, పంట పొలాలను పర్యవేక్షిస్తూ రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కరప మండల ఎమ్మార్వో ఆకుల సరస్వతి, ఎంపీడీవో శ్రీనివాస్, వ్యవసాయ అధికారి సత్య,కూటమి నాయకులు చంద్రు వెంకన్న రావు చౌదరి, ఏఎంసీ చైర్మన్ ముద్రగడ రమేష్, సొసైటీ అధ్యక్షులు దూడల నారాయుడు, సైనవరపు భవానీ శంకర్, బండారు మురళి, భోగిరెడ్డి కొండబాబు, గరగ జిమ్మీ, యాల్ల పండు, వెలుగుల లచ్చ రావు,పైడికొండల ప్రసాద్, మీసాల రాంబాబు, పెంకే సోమరాజు, కేమిరెడ్డి సురేష్, కంచి తేజ గణేష్, మారెళ్ళ శివ, ఇమ్మానియేలు, మణికంత, తదితరులు పాల్గొన్నారు.

# తుఫాను ప్రభావంతో ఈదురుగాలులు బీభత్సం

### నేలకొరిగిన చెట్లు విద్యుత్ స్తంభాలు - విద్యుత్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన చెట్లు తొలగించి స్తంభాల పునరుద్ధరణ





**కోటనందూరు, సెప్టెంబర్ 25, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రకృతి విరుచుకుపడితే జరిగే నష్టానికి ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది టిజే నగరం కాకినాడ జిల్లా కోటనందూరు మండలంలో వీచిన విపరీతమైన ఈదురుగాలులు, భారీ వర్షం ఇక్కడ తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. ఈ ఈదురుగాలుల హోరుకు రహదారి పక్కన ఉన్న ఓ భారీ వృక్షం ఒక్కసారిగా కుప్పకూలి విద్యుత్ వైర్ల పైబడింది. వరుసగా ఐదు కరెంటు స్తంభాలు ఒక్కసారిగా నేలకొరిగాయి. అందులో కొన్ని స్తంభాలు పక్కనే ప్రవహిస్తున్న నీటి కాలువలోకి వంగిపోవడంతో ఆ ప్రాంతమంతా విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా మారి, విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఘటన జరిగిన వెంటనే విద్యుత్ శాఖ ఏఈ వెంకటరమణ తన సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. రహదారిని మూసివేసిన పెద్ద చెట్టు కొమ్మలను యంత్రాలు, గొడ్డళ్లతో నరికి వేగంగా తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. మరోవైపు కాలువలో పడిపోయిన విద్యుత్ వైర్లను, దెబ్బతిన్న స్తంభాలను తొలగించి, ఆ స్థానంలో కొత్త స్తంభాలను నాటి విద్యుత్ సరఫరాను విజయవంతంగా పునరుద్ధరించారు. విద్యుత్ సిబ్బంది అహర్నిశలు శ్రమించి అతి తక్కువ సమయంలోనే విద్యుత్ పునరుద్ధరించడంతో తాటిపాక జగన్నాథ నగరం గ్రామస్తులు స్థానిక ప్రజలు విద్యుత్ సిబ్బందిని అభినందించి హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# నేడు, రేపటిలోగా గణపతి నిమజ్జనాలు పూర్తి చేయాలి

### సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్వివిఎస్ మూర్తి




**కోరుకొండ, సెప్టెంబర్ 25, విశ్వం వాయిస్ న్యూస్ :** శని, ఆదివారం రెండు రోజుల్లో కోరుకొండ సర్కిల్ పరిధిలో గణపతి మహోత్సవాల సందర్భంగా నేలకొల్పిన గణపతి విగ్రహాలను నిమజ్జనం చేయాలని కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ వివి సత్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా గణపతి నిమజ్జనాలు నిలుపుదల చేశారన్నారు. కోరుకొండ పోలీస్ సర్కిల్ పరిధిలో ఉన్న అన్ని గణపతి విగ్రహాలను నేడు,రేపు తప్పనిసరిగా నిమజ్జనం చేసి, పోలీసులకు సహకరించాల న్నారు. గణపతి కమిటీసభ్యులు నిమజ్జనాలలో ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ప్రతి గ్రామంలో చెరువుల నిండుకుండను తలపిస్తున్నాయని, అందువల్ల నిమజ్జనం చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ విషయాలను తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ ఎస్సై పి.శివాజీ పాల్గొన్నారు.

# గతంలో గంట వర్షానికే నడుములోతు నీరు

### ఇప్పుడు రెండు రోజులుగా కురుస్తున్నా ఆ పరిస్థితి లేదు - వర్షపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
### రూ.25 కోట్లతో మేజర్ డ్రెయిన్ నిర్మాణం - 36, 42 డివిజన్లోని పలు ప్రాంతాల్లో పర్యటనలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 25, విశ్వం వాయిస్ న్యూస్ :** తుపాను ప్రభావంతో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ 36, 42 డివిజన్లలోని పలు ప్రాంతాల్లో పర్యటించి వర్షపు నీటి పరిస్థితిని పరిశీలించారు. గతంలో వర్షాలు కురిసిన సమయంలో ఈ ప్రాంతాల్లో నడుములోతు వరకు వర్షపు నీరు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని, ప్రస్తుతం రెండు రోజులు గా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నా ఆ పరిస్థితి లేదని, కూటమి ప్రభుత్వం చేపట్టిన డ్రైనేజీ అభివృద్ధి పనుల కారణంగా గణనీయమైన మార్పు కనిపిస్తోందని ఎమ్మెల్యే వాసు తెలిపారు.ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో గంట లేదా రెండు గంటల పాటు కురిసిన వర్షానికే రోజుల తరబడి నీరు నిలిచిపోయే పరిస్థితి ఉండేదని, ఆ సమస్య పరిష్కారం కోసం కొత్తగా నిర్మించిన అనుసంధాన డ్రైనేజీ వ్యవస్థల కారణంగా వర్షపు నీరు వేగంగా బయటకు వెళ్తోందని వివరించారు.అయితే ప్రస్తుతం కొద్దిపాటి నీరు నిలుస్తున్న ప్రాంతాలకు కూడా శాశ్వత పరిష్కారం కల్పించేందుకు రూ.25 కోట్లతో మేజర్ డ్రెయిన్ నిర్మాణానికి చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే వాసు తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుష్కరాల పనులకు నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో సంబంధిత పనులకు టెండర్లు పూర్తయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. పైనుంచి వచ్చే వర్షపు నీటి ప్రవాహాన్ని సమర్థవంతంగా మళ్లించి, ఆయా ప్రాంతాల్లో నీరు నిలిచిపోకుండా డ్రైనేజీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే ఈ మేజర్ డ్రెయిన్ నిర్మాణం లక్ష్యమని స్థానికులకు వివరించారు. ఈ పనులు పూర్తయిన తర్వాత ప్రస్తుతం కనిపిస్తున్న కొద్దిపాటి నీటి నిల్వ సమస్య కూడా ఉండదని స్థానిక ప్రజలకు భరోసా ఇచ్చారు.ఇప్పటికే చేపట్టిన డ్రైనేజీ పనుల వల్ల గతంతో పోలిస్తే నీరు నిలిచే సమయం గణనీయంగా తగ్గిందని, రానున్న రోజుల్లో చేపట్టే మేజర్ డ్రెయిన్, రోడ్డు తదితర అభివృద్ధి పనులతో సమస్యకు పూర్తిస్థాయిలో పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే వాసు తెలిపారు.వర్షాలు కురుస్తున్న సమయంలోనే క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకోవడం ద్వారా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో అందుబాటులో ఉంటామని, అభివృద్ధి పనులు పూర్తయ్యే వరకు సంబంధిత సమస్యలను పర్యవేక్షిస్తామని హామీ ఇచ్చారు.

### ఎమ్మెల్యే నానాజీ ఆదేశాలతో

# కాలువలో పూడిక తొలగింపు పనులు



**కాకినాడ రూరల్, సెప్టెంబర్ 25, విశ్వం వాయిస్ న్యూస్ :** భారీ వర్షాల కారణంగా రమణయ్యపేట పంచాయతీ పరిధిలోని పేట కాలువలోకి వర్షపు నీరు, డ్రైనేజీ నీరు చేరడంతో కాలువ పూర్తిగా ముంపునకు గురైంది. దీంతో నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడి పరిసర ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాల మేరకు జనసేన నాయకులు తాటికాయల వీరబాబు ఆధ్వర్యంలో కాలువలో పూడికతీత పనులు చేపట్టారు. రమణయ్యపేట పంచాయతీ పరిధిలో జనచైతన్య లేఔట్ నుండి ఎఫ్సీఐ కాలనీ మీదుగా ఉన్న పేట కాలువ పూర్తిగా నీటితో మునిగిపోవడంతో పంచాయతీ కార్యదర్శి బి. చంద్రకళ ఏర్పాటు చేసిన శానిటేషన్ సిబ్బంది, ఎలక్ట్రికల్ సిబ్బంది సమన్వయంతో కాలువలో కొన్ని సంవత్సరాల నుండి పేరుకుపోయిన పూడిక, చెత్తాచెదారం తొలగించే పనులు చేపట్టారు. నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా కాలువను శుభ్రం చేయడంతో పాటు ముంపు సమస్యను తగ్గించేలా చర్యలు చేపట్టారు.వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో కాలువలు, డ్రైనేజీల్లో పూడికతీత పనులను మరింత వేగవంతం చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఎమ్మెల్యే నానాజీ ఆదేశాలతో అధికారులు, జనసేన నాయకులు కాకినాడ జిల్లా పార్లమెంట్ నిర్వహణ కమిటీ సభ్యులు అయిన దోమాదుల స్వాతి, దారపు శిరీష, దులుపుడి వీరభద్రరావు, ఆకుల ప్రవీణ్, మనోహర్ గుప్తా, స్పందించి తక్షణ చర్యలు చేపట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ పూడిక తీత కార్యక్రమంలో పంచాయతీ జనసేన నాయకులు వీరబాబు, రామిరెడ్డి సునీల్ తోటకూర సతీష్. శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.

### ముంపునకు గురైన వరి పంటలో

# తెగుళ్లు, పురుగుల నివారణకు జాగ్రత్తలు

### రైతులు అప్రమత్తంగా ఉండాలి.. వ్యవసాయ శాఖ సూచనలు



**గోకవరం, సెప్టెంబర్ 25, విశ్వం వాయిస్ న్యూస్ :** ముంపునకు గురైన వరి పంటలో వివిధ రకాల తెగుళ్లు, పురుగులు ఆశించే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా కాండం కుళ్లు తెగులు, బ్యాక్టీరియల్ ఆకు ఎండు తెగులు సోకే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముందుగా పొలంలో నిలిచిన నీటిని పూర్తిగా బయటకు తీసివేయాలి. అనంతరం మూడు రోజుల్లోపు హెక్సాకోనజోల్ 2 మి.లీ. మందును లీటరు నీటికి లేదా వాలిడామైసిన్ 2.5 మి.లీ. మందును లీటరు నీటికి కలిపి పంటపై పిచికారీ చేసుకోవాలని తెలిపారు. అలాగే ముంపునకు గురైన వరి పొలాల్లో వరి దోమ ఆశించే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలి. పొలంలోని నీటిని తొలగించిన అనంతరం వరి దుబ్బుల మొదళ్లను పరిశీలించి పురుగు ఉధృతిని గుర్తించాలి. పురుగు ఆశించినట్లయితే పైమెట్రోజిన్ 120 గ్రాములు లేదా డైనోటిఫ్యూరాన్ 80 గ్రాములు ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. వరి దోమ ఉధృతి అధికంగా ఉన్నట్లయితే ట్రైఫ్లూమిజోపైరిమ్ (పెక్సాలాన్) 94 మి.లీ. మందును ఎకరాకు ఉపయోగించి, వరి దుబ్బులు మొత్తం తడిచేలా పిచికారీ చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. ముంపు అనంతరం పంట పరిస్థితిని రైతులు క్రమం తప్పకుండా పరిశీలిస్తూ, తెగుళ్లు లేదా పురుగుల లక్షణాలు కనిపించిన వెంటనే వ్యవసాయ శాఖ అధికారుల సలహాతో తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

### గరుడ పథకం అమలుకు

# మార్గం సుగమం

### బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోమూర్తుల నరసింహమూర్తి




**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 25, విశ్వం వాయిస్ న్యూస్ :** బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా గరుడ పథకం పునరుద్ధరణకు మార్గం సుగమమైందని బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోమూర్తుల నరసింహమూర్తి తెలిపారు. త్వరలోనే పథకానికి సంబంధించిన నియమ నిబంధనలు, మార్గదర్శకాలను వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు. 2014-18 మధ్యకాలంలో బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణులకు అనేక సంక్షేమ పథకాలు అమలయ్యాయని, వాటి ద్వారా ఆ వర్గానికి భరోసా కలిగిందని నరసింహమూర్తి తెలిపారు. 2019-24 మధ్యకాలంలో పాలకుల పనితీరు కారణంగా పలు పథకాలు నిర్వీర్యమయ్యాయని ఆరోపించారు. పథకాల అమలులో స్థానిక వైసీపీ నాయకుల సిఫారసులు ఉంటేనే ప్రయోజనాలు అందే పరిస్థితి ఉండేదని పేర్కొన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం బ్రాహ్మణ కార్పొరేషన్ను పునరుద్ధరించిందన్నారు. కార్యదక్షతతో పాటు పార్టీ పట్ల, బ్రాహ్మణుల స్థితిగతులపై అవగాహన కలిగిన కే. బుచ్చి రాంప్రసాద్ను చైర్మన్గా నియమించడంతో పాటు కూటమి విజయానికి కృషి చేసిన పలువురిని డైరెక్టర్లుగా నియమించారని తెలిపారు. చైర్మన్, డైరెక్టర్లు సమష్టిగా పనిచేస్తూ బ్రాహ్మణుల సమస్యలు, అవసరాలపై అధ్యయనం చేశారని చెప్పారు. అత్యవసరంగా గరుడ పథకాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని తొలి సమావేశాల నుంచే నిర్ణయించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం విడిచిపెట్టిన ఆర్థిక ఇబ్బందుల కారణంగా పథకం అమలులో కొంత జాప్యం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్తో చర్చించి పథకాల అమలుకు అవసరమైన నిధులు కేటాయించాలని కోరినట్లు నరసింహమూర్తి తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చైర్మన్, డైరెక్టర్లు నిరంతరం కృషి చేస్తూ కార్పొరేషన్ను తిరిగి బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. గరుడ పథకాన్ని పునరుద్ధరించనున్నట్లు చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ ప్రకటించడం బ్రాహ్మణ సమాజంలో నూతన ఉత్సాహాన్ని నింపిందన్నారు. పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు, అర్హతలు, నిబంధనలను త్వరలోనే వెల్లడిస్తామని చెప్పారు. గరుడ పథకం పునరుద్ధరణకు కృషి చేసిన చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ను త్వరలో కలిసి బ్రాహ్మణ సమాజం తరపున అభినందనలు తెలియజేస్తామని నరసింహమూర్తి తెలిపారు.

# ‘ది ప్యారడైజ్’ సినిమాకు నెగెటివ్ రివ్యూలు

## హీరో నాని ఏమన్నారంటే..?




న్యాచురల్ స్టార్ నాని హీరోగా నటించిన లేటెస్ట్ సినిమా ‘ది ప్యారడైజ్’. శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన ఈ పీరియాడికల్ యాక్షన్ ఎంటర్ టైనర్ గురువారం (సెప్టెంబర్ 24) ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే భారీ అంచనాలతో రిలీజైన ఈ మూవీకి నెగెటివ్ రివ్యూస్ వచ్చాయి. ‘దసరా’ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత హీరో నాని, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్ లో వచ్చిన రెండో సినిమా ‘ది ప్యారడైజ్’. పీరియాడికల్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా తెరకెక్కిన ఈ సినిమాలో కయాదు లోహర్ కథానాయిక. కలెక్షన్ కింగ్ మోహన్ బాబు, సంపూర్ణేష్ బాబు, రాఘవ్ జుయేల్, సోనాలి కులకర్ణి తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. గురువారం (సెప్టెంబర్ 24) ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాకు భారీ కలెక్షన్లు వచ్చాయి. మొదటి రోజే రూ. 88 కోట్లకు పైగా కలెక్షన్లు వచ్చినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. అయితే ది ప్యారడైజ్ సినిమాకు చాలా మంది నెగెటివ్ రివ్యూలు ఇచ్చారు. సోషల్ మీడియాలోనూ ఈ చిత్రంపై ట్రోల్స్ వస్తున్నాయి. ఇప్పుడు వీటిపై హీరో నాని స్వయంగా స్పందించాడు. ది ప్యారడైజ్ సినిమాపై వస్తోన్న ట్రోల్స్ నెగెటివిటీ గురించి సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టాడు. ‘ది ప్యారడైజ్’సినిమా పై మీ అభిప్రాయాలు, స్పందన అన్నింటినీ చూశా. మీరు చూపించిన ప్రేమతో పాటు, సరదా ట్రోల్స్‌ను కూడా స్వీకరిస్తున్నా. దీనిని తమ సినిమాగా ప్రేక్షకులు స్వీకరించిన తీరు నా హృదయానికి హత్తుకుంది. అదే సమయంలో సినీ విమర్శకులు, రివ్యూవర్లు ఎత్తి చూపిన పొరపాట్లు, లోటుపాట్లను పరిగణనలోకి తీసుకుంటాను. మీ అందరికీ కృతజ్ఞతలు. మీకు ప్రత్యేకమైన అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో రక్తం, చెమట చిందించి ది ప్యారడైజ్ సినిమాను తీర్చిదిద్దాం. మీరు దీన్ని సంబరంగా చేసుకోవచ్చు. విమర్శించవచ్చు. సినిమాపై మీరు చూపించిన ఉత్సాహం, నాపై కురిపించిన ప్రేమ, ఆప్యాయతకు నాలో కృతజ్ఞత భావాన్ని నింపాయి’ అని ట్వీట్ చేశాడు నాని.

‘అతడు’ రోజులొచ్చేశాయ్..

# యంగ్ లుక్‌లో మహేశ్.. ఫ్యాన్స్ ఫిదా!



సూపర్ స్టార్ మహేశ్ బాబు తన సరికొత్త లుక్‌తో ఇంటర్నెట్‌లో సంచలనం సృష్టిస్తున్నారు. కొన్నేళ్లుగా గడ్డంతో రఫ్ లుక్‌లో కనిపించిన ఆయన, తాజాగా పూర్తిగా క్లీన్ షేవ్ చేసి మునుపటి కంటే యంగ్‌గా కనిపించడంతో అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ వరల్డ్ చిత్రం ‘వారణాసి’ షూటింగ్‌లో భాగంగా కాశీ షెడ్యూల్ పూర్తి చేసుకున్న మహేశ్, తాజాగా హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రత్యక్షమయ్యారు. ఆయన కొత్త లుక్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. ఎయిర్‌పోర్టులో ఎంతో ఉల్లాసంగా కనిపించిన మహేశ్, తనను ఫొటోలు తీస్తున్న కెమెరాలను చూసి నవ్వుతూ తన గడ్డం వైపు చూపిస్తూ ‘గడ్డం లేదు’ అన్నట్లుగా చిలిపి సైగలు చేశారు. ఈ దృశ్యాలు చూసిన ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. 51 ఏళ్ల వయసులో కూడా 24 ఏళ్ల కాలేజీ కుర్రాడిలా వెలిగిపోతున్నారంటూ నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. చాలా కాలం తర్వాత మహేశ్‌ను ఇలా క్లీన్ షేవ్‌లో చూడటంతో ‘అతడు’, ‘ఒక్కడు’ సినిమాల నాటి లుక్ గుర్తొస్తోందని, ఆ రోజులు మళ్లీ వచ్చేశాయని సంబరపడుతున్నారు. అయితే, మహేశ్‌లో ఈ ఆకస్మిక మార్పు వెనుక బలమైన కారణమే ఉందనే చర్చ సినీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. రాజమౌళి సినిమా కోసం మహేశ్ గత రెండేళ్లుగా తన శరీరాకృతిని మార్చుకోవడంతో పాటు గడ్డంతో కూడిన రఫ్ గెటప్‌ను కొనసాగిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన రుద్ర అనే ట్రావెలర్‌గా, శ్రీరాముడిగా విభిన్న కోణాల్లో కనిపిస్తారని ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం సినిమాలో దాదాపు 15 నిమిషాల పాటు సాగే ఒక కీలక ఎపిసోడ్‌లో మహేశ్ 24 ఏళ్ల యువకుడిగా కనిపించనున్నారట. ఈ యువకుడి పాత్ర చిత్రీకరణ కోసమే మహేశ్ బాబు క్లీన్ షేవ్ చేసుకున్నారా? లేక కాశీ షెడ్యూల్ ముగియడంతో కాస్త రిలాక్స్ అయ్యేందుకు ఈ లుక్‌లోకి మారారా? అన్నది ఇప్పుడు తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. కారణం ఏదైనా మహేశ్ ‘ఏజ్‌లెస్ హ్యాండ్‌సమ్’ లుక్ అభిమానులకు పండగలా మారింది. ఈ మార్పు వెనుక ఉన్న అసలు రహస్యం తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన వచ్చేవరకు వేచి చూడాల్సిందే.

# వెండితెరపై చందమామలాంటి అందం.. కయాదు లోహర్!



వెండితెరపై విరిసిన కలువనే ‘కయాదు లోహర్’ అనేది కుర్రాళ్లు చెప్పుకునే మాట. తమన్నా తరువాత ‘మిల్కీ బ్యూటీ’ అనే మాట ఏ హీరోయిన్ విషయంలో వాడొచ్చునా అనే ప్రశ్నకి ఆన్సర్ గా కనిపించే రూపమే కయాదు లోహర్. తమన్నాతో పోటీపడే మేనిఛాయతో ఎంట్రీ ఇచ్చిన ఈ సుందరి, అభిమానులను పెద్ద సంఖ్యలో సంపాదించుకోవడానికి ఎక్కువ సమయం తీసుకోలేదు. చక్కని కనుముక్కుతీరుతో పాటు అందుకు తగిన అభినయంతో ఈ బ్యూటీ ఆకట్టుకుంటూ వెళుతోంది. వరుస సినిమాలతో మరింత బిజీ అవుతోంది. సాధారణంగా ఒక భాషలో బిజీ అయిన తరువాతనే హీరోయిన్స్ మరో భాషలోకి ఎంట్రీ ఇస్తుంటారు. అలా కాకుండా వరుసగా వివిధ భాషల్లో అవకాశాలను సంపాదించుకోవడం చాలా తక్కువ మంది హీరోయిన్స్ విషయంలో జరుగుతూ ఉంటుంది. అలాంటి ఒక అరుదైన ఫీట్ కయాదు లోహర్ కూడా సాధ్యం చేసింది. కన్నడ సినిమాతో తన కెరియర్ ను మొదలుపెట్టిన ఈ చందమామ లాంటి అమ్మాయి, తెలుగు .. తమిళ .. మలయాళ .. మరాఠీ భాషలకు పరిచయం కావడానికి ఎక్కువ సమయం తీసుకోకపోవడం విశేషం. తన కెరియర్ ఆరంభంలోనే తెలుగులో శ్రీవిష్ణుతో ‘అల్లూరి’ .. విష్వక్సేన్ తో ‘ఫంకీ’ చేసిన ‘కయాదు లోహర్’కి ఆ సినిమాలు సరిగ్గా ఆడక పోవడం వలన సరైన గుర్తింపురాలేదు. ఆ తరువాతనే యూత్ లో ఆమె క్రేజ్ పెరుగుతూ వెళ్లింది. ఇప్పుడు తమిళ .. మలయాళ ప్రాజెక్టులతో ఆమె ఫుల్ బిజీ. ఈ నేపథ్యంలోనే తెలుగులో ఆమె చేసిన మరో సినిమాగా ‘ది ప్యారడైజ్’ నిన్న థియేటర్లకు వచ్చింది. ఈ సినిమాలో కనిపించినంత సేపు తన అందంతో ఆమె ఆకట్టుకుంది. కాకపోతే ఆమె పాత్రకి సరైన ప్రాధాన్యత లేకపోవడం అభిమానులకు అసంతృప్తిని కలిగించింది. కయాదు గ్లామర్ కి తగిన సరైన ప్రాజెక్టులు .. పాత్రలు పడితే, తెలుగులోను ఆమె బిజీ కావడం ఖాయమనే టాక్ వినిపిస్తోంది. ఆ రోజు త్వరలోనే వస్తుందేమో చూడాలి మరి.

# పోల్ వాల్ట్‌లో భారత్‌కు కాంస్యం.. భరణిక రికార్డు




ఆసియా గేమ్స్- 2026లో భారత మహిళా అథ్లెట్ భరణికా ఇళంగోవన్ చరిత్ర సృష్టించింది. పోల్ వాల్ట్ ఈవెంట్‌లో 4.15 మీటర్ల ఎత్తు ఎగిరి కాంస్య పతకం సాధించింది. ఇప్పటివరకు నిర్వహించిన ఆసియా గేమ్స్‌లో ఈ ఈవెంట్‌లో భారత్‌కు పతకం రావడం ఇదే ప్రథమం. ఈ పోటీల్లో కజకిస్థాన్‌కు చెందిన పోలినా నివానోవా కూడా 4.15 మీటర్లు ఎగిరి మూడో స్థానంలో నిలిచింది. దీంతో కాంస్య పతకాన్ని ఇద్దరూ పంచుకున్నారు. జపాన్‌కు చెందిన మిసాకి మరోటా 4.55 మీటర్లు క్లియర్ చేసి పసిడి పతకం సొంతం చేసుకోగా.. చైనాకు అథ్లెట్ చుంగే నియూ 4.50 మీటర్లతో రజతం సాధించింది. 1997 ఫిబ్రవరి 3న తమిళనాడులోని మయిలాడుతురైలో జన్మించిన భరణిక.. ఈ స్థాయికి చేరుకునేందుకు ఎన్నో కష్టనష్టాలకోర్చింది. 2020లో మోకాలి గాయంతో సుదీర్ఘకాలం విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత 2023లో భువనేశ్వర్‌లోని రిలయన్స్ ఫౌండేషన్ హై పెర్ఫామెన్స్ సెంటర్‌కు వెళ్లింది. అక్కడ కోలుకునేందుకు అనువైన పరిస్థితులతోపాటు మెరుగైన శిక్షణ అందడంతో జాతీయ స్థాయి పోటీలకు సిద్ధమైంది. మార్చి నెలలో బెంగళూరులో జరిగిన ఇండియన్ ఓపెన్ జంప్ కాంపిటీషన్‌లో 4.10మీటర్ల ఎత్తును క్లియర్ చేసి.. ఆసియా క్రీడలకు అర్హత సాధించింది. భారత్‌కు బంగారు పతక ఆశలు రేకెత్తించింది. అంతేకాకుండా 65వ నేషనల్ ఇంటర్ స్టేట్ సీనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోల్ వాల్ట్ ఈవెంట్‌లో 4.20 మీటర్ల ఎత్తు ఎగిరి విజేతగా నిలిచింది.

**10వేల మీటర్ల పరుగులో గుల్‌వీర్‌కు రజతం**

మరోవైపు, లాంగ్ డిస్టెన్స్ రన్నింగ్ విభాగంలో గుల్‌వీర్ సింగ్ రజతం సాధించాడు. పురుషుల 10000 మీటర్ల దూరాన్ని 28 నిమిషాల 29 సెకన్ల 38 మిల్లీ సెకన్లలో పూర్తి చేసి సిల్వర్ మెడల్ అందుకున్నాడు. 1500 మీటర్లు, 5000 మీటర్ల విభాగంలోనూ గుల్‌వీర్ సింగ్ పోటీ పడనున్నాడు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత షూటర్లు కమల్‌జీత్, సురుచి సింగ్ స్వర్ణం సాధించిన సంగతి తెలిసిందే. తాజా ఆసియా క్రీడల్లో భారత్ ఇప్పటివరకు 23 పతకాలు సాధించింది. వీటిలో 2 స్వర్ణం కాగా, 9 రజతం, 12 కాంస్య పతకాలున్నాయి.

ఐసీసీ ట్రోఫీలు సొంతం కావాలంటే..

# భారత్‌పై గెలవాలి : డారెన్ సామీ



మూడు వన్డేలు, ఐదు టీ20లను ఆడేందుకు భారత పర్యటనకు వెస్టిండీస్ వచ్చింది. ఆదివారం నుంచి వన్డే సిరీస్ మొదలు కానుంది. ఇక్కడ టీమ్ఇండియాపై దాదాపు 24 ఏళ్ల నుంచి విండీస్ జట్టు సిరీస్‌ను గెలవలేదు. ఐసీసీ కప్పులను తమ జట్టు గెలవాలంటే.. కచ్చితంగా భారత్‌లాంటి బలమైన టీమ్‌ను అడ్డుకోవాల్సి ఉందని వెస్టిండీస్ కోచ్ డారెన్ సామీ అభిప్రాయపడ్డాడు. ఈ సిరీస్‌ను తాము వరల్డ్ కప్ అర్హతకు సన్నాహకంగా మార్చుకుంటామని వెల్లడించాడు. “గత 24 ఏళ్లుగా మాకు భారత్ వేదికగా సిరీస్ దక్కలేదు. ఈసారి గెలిచేందుకు మంచి అవకాశం. మమ్మల్ని మేం సవాల్ చేసుకొని అత్యుత్తమ ఆటతీరు ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తాం. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఐసీసీ ఈవెంట్లలో గెలవాలంటే.. ముందు భారత్ వంటి పెద్ద జట్లను అడ్డుకొనేలా ఆటతీరు ఉండాలి. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో క్వాలిఫయర్స్ ఉంటాయి. దక్షిణాఫ్రికా వేదికగా జరగబోయే వరల్డ్ కప్‌లో మేం ఆడేందుకు అర్హత సాధిస్తామనే నమ్మకం ఉంది. ఇప్పుడీ సిరీస్‌ను అందుకు సన్నాహకంగా భావిస్తాం” అని సామీ తెలిపాడు.

**మా జట్టులో..**

“ప్రస్తుతం మేం బరిలోకి దిగే జట్టులో నాణ్యమైన ప్లేయర్లే ఉన్నారు. ఒకరిద్దరిపైనే మేం ఆధారపడం. మా స్థాయికి తగ్గట్టు ఆడితే ఈపాటికే మేం నేరుగా వరల్డ్ కప్ పోటీలకు అర్హత సాధించేవాళ్లం. కానీ, ఆరు పాయింట్ల తేడాతో మిస్ చేసుకున్నాం. ఇప్పుడు వన్డే క్రికెట్‌లో మెరుగైన పురోగతి సాధించాం. ఇప్పుడు భారత్‌తో సిరీస్‌లో ప్రతి ఒక్కరికీ అవకాశం ఇవ్వడానికి ప్రయత్నిస్తాం. 19 ఏళ్ల కుర్రాడు విటెల్‌లో అద్భుతమైన టాలెంట్ ఉంది. మాకు మోతీ రూపంలో ఓ అద్భుతమైన రిస్ట్ స్పిన్నర్ ఉన్నాడు. గత కొన్నేళ్లుగా అతడి గురించి వినే ఉంటారు. ఇప్పుడు విటెల్ కూడా ఆరంభంలో జట్టు విజయాల్లో ప్రభావం చూపించడం అభినందనీయం. జట్టుగా మేం చేయాల్సింది చాలా ఉంది. అతడికి మద్దతుగా నిలుస్తాం” అని సామీ పేర్కొన్నాడు.

# ఆసియా క్రీడలు.. భారత్‌కు రెండో గోల్డ్ మెడల్



ఆసియా క్రీడల షూటింగ్ విభాగంలో తొలుత మను బాకర్ వంటి స్టార్ షూటర్లు నిరాశపర్చినా.. ఇప్పుడు ఏకంగా గోల్డ్ మెడల్ దక్కింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత షూటర్లు కమల్‌జీత్, సురుచి సింగ్ స్వర్ణం సాధించారు. దీంతో ఈ క్రీడల్లో మన దేశానికి రెండో పసిడి పతకం లభించింది. అంతకుముందు మహిళల క్రికెట్ జట్టు బంగారు పతకం సాధించిన సంగతి తెలిసిందే. ఈ విభాగం మెడల్ రౌండ్‌లో మొత్తం నాలుగు జోడీలు ఫైనల్‌కు అర్హత సాధించాయి. ఇందులో కమల్‌జీత్, సురుచి కలిసి మొత్తంగా 484.6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు. ఇక, దక్షిణకొరియా ద్వయానికి రజతం, ఇరాన్ జోడీకి కాంస్యం దక్కాయి. ఇక, పురుషుల 50 మీటర్ల రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో భారత త్రయం రజతం సాధించింది. ఫైనల్‌లో మన షూటర్లు ఐశ్వరీ ప్రతాత్ సింగ్ తోమర్, రుద్రాంశ్ పాటిల్, నీరజ్ కుమార్ మొత్తంగా 1762 పాయింట్లు సాధించారు. 1766 పాయింట్లతో చైనా టీమ్ స్వర్ణం నెగ్గింది. కేవలం నాలుగు పాయింట్ల తేడాతో మన జట్టుకు త్రుటిలో పసిడి చేజారింది. మరోవైపు స్క్వాష్ మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్‌లో జోష్న చిన్నప్ప, సెంథిల్ కుమార్ పతకం ఖాయం చేసుకున్నారు. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో ఫిలిప్పీన్స్ జోడీ డేవిడ్ పెలినో-జెమైకా అరిబాడోను 11-3, 11-5తో ఓడించి మన ఆటగాళ్లు సెమీస్‌కు దూసుకెళ్లారు. దీంతో కనీసం కాంస్యం ఖాయం చేసుకున్నారు. అటు టేబుల్ టెన్నిస్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో భారత ద్వయం మనుష్ షా, దియా చితాలే కూడా పతకం ఖాయం చేసుకున్నారు. క్వార్టర్స్‌లో వీరు హాంకాంగ్ జోడీని 11-6, 13-15, 11-9, 11-5తో ఓడించారు.

మహిళల ఆంధ్రా ప్రిమియర్ లీగ్..

# ఫైనల్‌కు ‘గోదావరి’



గోదావరి గోల్డెన్ ఈగల్స్ అద్భుతం చేసింది. మహిళల ఆంధ్రా ప్రిమియర్ లీగ్ 2026 సీజన్‌లో ఫైనల్‌కు చేరుకుంది. కీలకమైన మ్యాచ్‌లో వైజాగ్ ఫైర్ బర్డ్స్‌పై విజయం సాధించింది. దీంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుని ఫైనల్ బెర్తును ఖాయం చేసుకుంది. గత రెండు రోజులు వర్షాల కారణంగా మ్యాచులు రద్దైన సంగతి తెలిసిందే. వైజాగ్ ఫైర్ బర్డ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 27 పరుగుల తేడాతో గోదావరి విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన గోదావరి 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. పుష్పిత గౌడ (91లి) అదరగొట్టింది. ఫ్లావియా పెరీరా (34లి), బాతుల హర్షిత (21) మెరిశారు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన వైజాగ్ 129 పరుగులకే పరిమితమైంది. విష్ణు వర్ధిని (23లి) టాప్ స్కోరర్‌గా నిలిచింది. సృష్టి శేఖర్ (2/25) మరోసారి నాణ్యమైన బౌలింగ్ వేసింది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com